RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 33 | బుధవారం, ఫిబ్రవరి 28, 2024 | పేజీలు : 4

### గృహ జ్యోతి పథకానికి మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్: నిరుపేదల గృహాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'గృహ జ్యోతి పథకాన్ని' మంగళవారం ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వార అర్హత కలిగిన కుటుంబాలు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందవచ్చు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకం ప్రయోజనాలను పొందాలనుకునేవారు తప్పనిసరిగా ప్రజాపాలన పోర్టల్ లేదా ఆమోదించబడిన ఛానెల్‌ల ద్వారా తమ దరఖాస్తులను ప్రాసెస్ చేసినట్లు నిర్ధారించుకోవాలి. ముఖ్యంగా, దరఖాస్తుదారులు వారి గృహ సేవా కనెక్షన్ నంబర్‌తో పాటు వారి ఆధార్ కార్డ్‌తో ,ఆహార భద్రతా కార్డ్ (తెల్ల రేషన్ కార్డ్) వివరాలను తప్పనిసరిగా అందించాలి.

# గగన్‌యాన్ వ్యోమగాములు వీళ్లే...



## ఆ నలుగుర్ని పరిచయం చేసిన ప్రధాని మోదీ

**కేరళలో తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్‌సి) ను సందర్శించిన ప్రధాన మంత్రి**

**- సుమారు రూ.1800 కోట్ల విలువైన మూడు ముఖ్యమైన అంతరిక్ష మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం..**

**- నలుగురు వ్యోమగాములు కేవలం నాలుగు పేర్లు లేదా వ్యక్తులు కాదు, 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకెళ్లే నాలుగు శక్తులు**



**- గంగన్ యాన్ పురోగతి పై సమీక్షబీ వ్యోమగాములుగా ఎంపికైనవారికి 'వ్యోమగామి వింగ్స్ ' ప్రదానం..**

**తిరువనంతపురం (గరుడ వార్త) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేరళలోని తిరువనంతపురంలో విక్రం సారాభాయ్ స్పేస్ సెంటర్ (వి.ఎస్.ఎస్.సి)ని సందర్శించారు. సుమారు రూ.1800 కోట్ల విలువైన మూడు ముఖ్యమైన అంతరిక్ష మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ లో ఎస్ఎల్ వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పిఐఎఫ్)బీ . మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ లో కొత్త 'సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటీ'బీ తిరువనంతపురంలోని వి.ఎస్.ఎస్.సి వద్ద 'ట్రైసోనిక్ విండ్ టన్నెల్' ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా గగన్ యాన్ మిషన్ పురోగతిని సమీక్షించిన మోదీ, మిషన్ ద్వారా అంతరిక్షం లోకి వెళ్లేందుకు నియమితులైన నలుగురు వ్యోమగాములకు 'వ్యోమగామి వింగ్స్' ప్రదానం చేశారు. గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా వీరిలో ఉన్నారు. భారత్ మాతాకీ జై నినాదం తో సభా ప్రాంగణం మారుమోగుతుండగా, 'వ్యోమగాములకు నిలబడి అభినందనలు తెలపాలని' పిలుపు ఇస్తూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతి దేశ అభివృద్ధి ప్రయాణంలో వర్తమానాన్ని మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలను నిర్వచించే ప్రత్యేక క్షణాలు ఉన్నాయని, ఇది భూమి, గాలి, నీరు, అంతరిక్షంలో దేశం సాధించిన చారిత్రాత్మక విజయాలను ప్రస్తుత తరం గర్వించగల సందర్భం అని అన్నారు. అయోధ్య నుంచి తయారైన కొత్త 'కాలచక్రం' ప్రారంభం గురించి తాను చేసిన ప్రకటనను గుర్తు చేసిన ప్రధాని మోదీ, భారతదేశం ప్రపంచ క్రమంలో తన స్థలాన్ని నిరంతరం విస్తరిస్తోందని, దేశ అంతరిక్ష కార్యక్రమంలో దాని దృశ్యాలను చూడవచ్చని అన్నారు. చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ అవతరించిన సందర్భంగా చంద్రయాన్ విజయాన్ని ప్రధాన మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. "ఈ రోజు శివ-శక్తి కేంద్రం యావత్ ప్రపంచానికి భారతీయ పరాక్రమాన్ని పరిచయం చేస్తోంది", అని ఆయన అన్నారు. వ్యోమగాములుగా నియమితులైన నలుగురు గగన్ యాన్ ప్రయాణికుల పరిచయాన్ని చారిత్రాత్మక సందర్భంగా ఆయన అభివర్ణించారు. "వారు నలుగురు కేవలం పేర్లు లేదా వ్యక్తులు కాదు, వారు 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను అంతరిక్షంలోకి తీసుకువెళ్ళే నాలుగు శక్తులు" అని ప్రధాన మంత్రి అన్నారు. '40 ఏళ్ల తర్వాత ఓ భారతీయుడు అంతరిక్షంలోకి వెళ్తున్నాడు. అయితే, ఇప్పుడు సమయం, కౌంట్ డౌన్ తో పాటు రాకెట్ కూడా మనదే' అన్నారు. వ్యోమగాములను కలుసుకుని జాతికి పరిచయం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ప్రధాని యావత్ దేశం తరపున వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ గవర్నర్ శ్రీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, కేరళ ముఖ్యమంత్రి శ్రీ పినరయి విజయన్, కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధరన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి, ఇస్రో చైర్మన్ శ్రీ ఎస్.సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ స్కీమ్ లను ప్రారంభించిన సిఎం రేవంత్



**హైదరాబాద్ ఫిబ్రవరి, 27 :** కాంగ్రెస్ సర్కార్ మరో రెండు గ్యారంటీలను ప్రారంభించింది. మహాలక్ష్మీ స్కీమ్ లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ తోపాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని మంగళవారం సచివాలయంలో మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. మాట ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకంజ వేయదు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలనేదే మా తపన. అందుకే ప్రజాపాలనలో దరఖాస్తులను తీసుకున్నాం. చేవేళ్లలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించి రెండు గ్యారంటీలను ప్రారంభించాలనుకున్నాం.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా అక్కడ లాంఛ్ చేయలేకపోయాం. పేదలకు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్న ఆలోచన కాంగ్రెస్ దే. ఆనాడు దీపం పథకం కింద పేదలకు గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. పేదల ఇండ్లలో వెలుగులు నింపుతున్నాం" అని చెప్పారు.

## ఎన్నికల్లో ఓటమి తప్పదని వారికి తెలుసు: ప్రధాని మోదీ

### ఇతర ప్రాంతాల్లో...

# జిగ్రీ దోస్తులు

**విరుచుకుపడిన ప్రధాని మోదీ**



తిరువనంతపురం: కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి వ్యతిరేకంగా బలమైన ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీలపై ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వారు కేరళలో బద్ధ శత్రువులని, కాని ఇతర రాష్ట్రాలలో 'చిరకాల ఉత్తమ మిత్రులు' (బిఎఫ్ఎఫ్‌లు) అని మోడీ పేర్కొన్నారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో బిజెపి రాష్ట్ర శాఖ పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో మాట్లాడిన మోడీ ప్రతిపక్షాల ధోరణిని ఆక్షేపించారు. దేశ పురోభివృద్ధి కోసం ప్రతిపక్షాల వద్ద రోడ్‌మ్యాప్ లేదని, అందుకే అవి రానున్నన లోక్‌సభ ఎన్నికలలో గెలవలేమని దృఢాభిప్రాయంతో ఉన్నాయని, ఆ కారణంగానే వాటి నేతలు తనను దుర్భాషలాడుతున్నారని మోడీ ఆరోపించారు.'కాంగ్రెస్, కమ్యూనిస్టులు కేరళలో పరస్పరం శత్రుభావంతో మెలగుతుంటాయి. కాని ఇతర రాష్ట్రాలలో అవి బిఎఫ్ఎఫ్‌లు అంటే చిరకాల ఉత్తమ మిత్రులు' అని ప్రధాని అన్నారు. కేరళ ముఖ్యమంత్రి (పినరయి విజయన్) అవినీతికి, కుంభకోణాలకు పాల్పడుతుంటారని కాంగ్రెస్ ఆరోపించిందని, వామపక్ష ప్రభుత్వాన్ని ఫాసిస్ట్‌గా ఆ పార్టీ అభివర్ణించిందని మోడీ చెప్పారు.

'అందుకు ప్రతిస్పందనగా కమ్యూనిస్టులు కాంగ్రెస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయించారని, ఆ పార్టీ పూర్వపు ప్రభుత్వాలకు వివిధ కుంభకోణాలలో ప్రమేయం ఉందని ఆరోపించారు.

## సోనియాగాంధీ మాటిస్తే...

# అది శిలాశాసనమే



హైదరాబాద్: ఆర్థిక ఇబ్బందులున్నా ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని, మాటిస్తే కాంగ్రెస్ వెనకడుగు వేయబోదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ మాటిస్తే అది శిలాశాసనమని ఆయన చెప్పారు. సోనియా మాటిస్తే తెలంగాణలో తప్పకుండా అమలు చేస్తామన్నారు. సోనియా గాంధీ ఇచ్చిన హామీని ఎప్పుడూ విస్మరించలేదని ఆయన తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, ఆమె ఇచ్చిన స్ఫూర్తితోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని రేవంత్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 2 హామీలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. సోనియాగాంధీపై విశ్వాసంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని, నిజమైన లబ్ధిదారులకు, అర్హులకు పథకాలను అందించడమే ప్రజా పాలన ఉద్దేశమని ఆయన చెప్పుకొచ్చారు. ఆర్థికంగా నియంత్రణ పాటిస్తూ ముందుకెళ్తున్నామని రేవంత్ చెప్పారు. సచివాలయంలో 200 యూనిట్ల ఫ్రీ కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

**దేశంలో తెలంగాణ నమూనా తీసుకొస్తాం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేసి పేదల ఇళ్లలో వెలుగులు నింపుతున్నామన్నారు. చేవెళ్లలో లక్షమంది మహిళల ముందు రెండు గ్యారంటీలను ప్రారంభించాలనుకున్నాం, కానీ, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ వల్ల చేవేళ్లలో ప్రారంభించ లేకపోయామని రేవంత్ చెప్పారు.

## సంపాదకీయం

# విజేతలు లేని యుద్ధం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శకుల్లో ఒకరైన అలెక్సీ నావల్నీ తాను నమ్మిన సిద్ధాంతాలకు అంతిమ మూల్యం చెల్లించుకున్న వ్యక్తిగా నిలిచారు. నావల్నీ మరణానికి ఆర్కిటిక్ జైలులో 'ఆకస్మిక మరణ సిండ్రోమ్'' కారణమని రష్యా అధికారులు చెబుతున్నారు. కానీ, వ్లాదిమిర్ పుతిన్ అతన్ని జైలులో చంపి, ఆపై ఆనవాళ్లను కప్పిపుచ్చడానికి మృతదేహాన్ని దాచారని అతని భార్య ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శకుల్లో ఒకరైన అలెక్సీ నావల్నీ తాను నమ్మిన సిద్ధాంతాలకు అంతిమ మూల్యం చెల్లించుకున్న వ్యక్తిగా నిలిచారు. నావల్నీ మరణానికి ఆర్కిటిక్ జైలులో 'ఆకస్మిక మరణ సిండ్రోమ్'' కారణమని రష్యా అధికారులు చెబుతున్నారు. కానీ, వ్లాదిమిర్ పుతిన్ అతన్ని జైలులో చంపి, ఆపై ఆనవాళ్లను కప్పిపు చ్చడానికి మృతదేహాన్ని దాచారని అతని భార్య ఆరోపించారు. పుతిన్ పాలనాకాలంలో రష్యాలో అలాంటి గొంతులు భారీ మూల్యం చెల్లించుకోవడం పరిపాటిగా మారింది. నావల్నీ మృతిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక పాశ్చాత్య దేశాలు దీన్ని 'హత్య' అని పిలుస్తున్నాయి. నావల్నీ మృతిపై అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని యూరోపియన్ యూనియన్ (ఈయూ) డిమాండ్ చేసింది. నావల్నీ మరణానికి అంతిమ బాధ్యత అధ్యక్షుడు పుతిన్, రష్యా అధికారులదేనని ఈయూ పేర్కొంది. రష్యా ప్రతిపక్ష నేత మరణానికి పుతిన్ కారణమని ఆరోపించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాస్కోపై అదనపు ఆంక్షలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉక్రెయిన్ యుద్ధ భూమిలో పెద్ద సంఖ్యలో రష్యన్లు ప్రాణాలు కోల్పోయినా యుద్ధాన్ని పుతిన్ కొనసాగిస్తున్నారు. పాశ్చాత్య రాజధానుల నుంచి వ్యతిరేకత వస్తున్నప్పటికీ, ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టిస్తున్నారు. రష్యాలో అసమ్మతిని, వ్యతిరేకతను అణచివేయడంలో ఆయన సఫలీకృతులయ్యారని, ఈ యుద్ధంలో ఆటుపోట్లు ఆయనకు అనుకూలంగా మారుతున్నాయని తెలుస్తోంది. గత వారం తూర్పు ఫ్రంట్‌లో ఉక్రేనియన్ దళాలు వెనక్కు తగ్గడం వల్ల పెద్ద మార్పేమీ కాకపోవచ్చు కానీ, ఇది కచ్చితంగా తూర్పు ఫ్రంట్‌లో రష్యన్ దళాలకు ధైర్యాన్ని ఇస్తుంది. ఇప్పుడు ఈ సెక్టార్‌లోని సరిహద్దు వెంబడి ఉక్రెయిన్ సైన్యం ఒత్తిడికి లోనవుతుంది. ఎన్ని ఆంక్షలు, సవాళ్లు ఎదురైనా తన సైనిక సాహసాన్ని కొనసాగించడానికి రష్యా ఆర్థిక వ్యవస్థ పటిష్టత తోడ్పడుతుంది. రికార్డు స్థాయిలో ముడిచమురు విక్రయాలు కొనసాగుతుండటంతో పుతిన్ ఖజానా నగదుతో నిండిపోయింది. రష్యాలో ఆర్థిక వృద్ధికి ఈ యుద్ధం ఆజ్యం పోస్తోంది. గత ఏడాదిలో మొత్తం జీ7 కంటే వేగంగా రష్యా ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందింది. 2024లోనూ ఇదే పరిస్థితి పునరావృతమవుతుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. పాశ్చాత్య దేశాలను ఇరుకున పెట్టడానికి పుతిన్‌కు ఈ పరిస్థితి వీలు కల్పించింది. ఉక్రెయిన్‌కు ఇది ఒక సున్నితమైన పరిస్థితి. ఎందుకంటే ఆ దేశానికి మానవ వనరులు, మందుగుండు సామగ్రి సరిపడా లేదు. పాశ్చాత్య సహాయం కూడా తగ్గిపోతోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ మరిన్ని ఆయుధాల కోసం విజ్ఞప్తి చేస్తూ, 'కృత్రిమ ఆయుధాల కొరత' రష్యాకు మాత్రమే సహాయపడుతుందని నొక్కి చెప్పారు. ఉక్రెయిన్‌కు సహాయంపై ఇప్పటికే పాశ్చాత్య దేశాల్లో అంతర్గతంగా అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అమెరికాలో రాజకీయ విభేదాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తూర్పు ఫ్రంట్ నుంచి ఉక్రెయిన్ వెనక్కు తగ్గడానికి తమ సాయాన్ని అందించలేకపోవడమే కారణమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అంగీకరించారు. అయితే కాంగ్రెస్ ఆమోదించకపోవడంతోనే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. కానీ, రిపబ్లికన్ల వ్యతిరేకత నేపథ్యంలో ఆయన చేయగలిగిందేమీ లేదు. సమయం తనకు అనుకూలంగా ఉందని పుతిన్ గతంలో కంటే ఎక్కువగా విశ్వసిస్తున్నారు. ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై విపరీతమైన ఒత్తిడిని పెంచుతూనే ఉంది. ఇది మరింత ఇబ్బందికరంగా పరిణమించకముందే వీలైనంత త్వరగా పరిష్కరించాల్సి ఉంది.

యుద్ధంతోనే సమస్యలు పరిష్కారం కావని, దానికి బదులుగా చర్చలు, దౌత్యం దిశగా ఒక మార్గాన్ని రూపొందించాలని భారత్ మొదటి నుంచి వాదిస్తోంది. ప్రస్తుతం రష్యా లాభాలు, ఉక్రెయిన్ విజయాలు తాత్కాలికమని గత రెండేండ్ల యుద్ధం, విధ్వంసం నుంచి గుణపాఠం నేర్చుకోవాల్సి ఉంది. ఈ యుద్ధంలో ప్రధాన పాత్రధారులు తమ చర్యలకు జరిగిన నష్టాన్ని గ్రహించి, సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ఉంది. ఉక్రేనియన్ అభద్రతలను, రష్యన్ ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని ఈ యుద్ధాన్ని పరిష్కరించాల్సి ఉంటుంది. ఆ దిశగా అందరూ కృషి చేస్తారని ఆశిద్దాం.

# బ్యాంకుల్లో పొదుపు చేస్తే పిల్లల భవిష్యత్తుకు భరోసా

- బ్యాంకుల్లో చేసిన పొదుపు విద్యార్థుల ఉన్నత విద్యకు రుణ సౌకర్యం
- శామీర్ పేటలో ఆర్థిక, అక్షరాస్యతపై జిల్లా ఆర్ బీ ఐ, లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ



**శామీర్ పేట, (గరుడ వార్త) :** బ్యాంకుల్లో పొదుపు చేసినట్లయితే పిల్లల ఉజ్వల భవిష్యత్తు కు బంగారు బాట వేసినట్లు అవుతుందని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేటలో రిజర్వ్ బ్యాంక్ (ఆర్ బీ ఐ), జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక, అక్షరాస్యత వారోత్సవం-2024 ను విద్యార్థులతో ర్యాలీ ఏర్పాటు చేయగా శామీర్ పేట ఎంపీడీవో మమతాబాయి ముఖ్యఅతిథిగా విచ్చేసి శ్రీనివాసులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ప్రజాప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి బ్యానర్లు, ఫ్లకార్డ్స్ పట్టుకొని గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీని ప్రారంభించి రాజీవ్ రహదారి వద్ద వైయస్ విగ్రహం వరకు నిర్వహించారు. బ్యాంకుల్లో పొదుపు చేయండి- పిల్లల బంగారు భవిష్యత్తుకై విద్యా రుణం పొందండి, పొదుపు చేయడం అలవాటు చేసుకోండి- ఆర్థిక లావాదేవీలను ఆర్జించండి, మీ పెట్టుబడిని వడ్డీతో పాటు పెరుగనీయండి- మీ పొదుపుని వృద్ధి చేయడం చూడండి అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తిరిగి వైయస్సార్ విగ్రహం నుంచి స్కూల్ వరకు ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలు, వారి తల్లిదండ్రులు బ్యాంకుల్లో డబ్బును పొదుపు చేయాలని, వారికి అభివృద్ధికి బాటలు వేయాలని ఆర్ బీ ఐ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆర్థిక, అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల్లో పొదుపు, డిజిటల్ లావాదేవీల పట్ల తెలుసుకోవాల్సిన ఆవశ్యకత పై వివరించారు. ఈ వారోత్సవ ర్యాలీలో ముఖ్యంగా విద్యార్థులకు బ్యాంకుల్లో పొదుపు వృద్ధి చెందడం పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అనిత, ఎంపీటీసీ సాయిబాబు, ఎంఈఓ వసంతకుమారి, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, పంచాయతీ కార్యదర్శి మౌనిక, స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్, అసిస్టెంట్ మేనేజర్ నరేష్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ పవన్ కుమార్, ఐడిబిఐ మేనేజర్ వాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 2024 హరితహారం లక్ష్యాలను అధిగమించేలా కార్యాచరణ రూపొందించండి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) :** 2024 సంవత్సరానికి గాను హరితహారం లో భాగంగా లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ తన చాంబర్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా కార్యచరణ ప్రణాళిక పై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో గత సంవత్సరం ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాలలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. మొక్కలు నాటడానికి అవసరమైన స్థలాలను గుర్తించాలని, హరిత నిధిలో ఎన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుకున్నారు. గ్రామాలలో ఖాళీ స్థలాన్ని గుర్తించి గ్రామ పంచాయతీలకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ జానకి రామ్, పరిశ్రమ శాఖ అధికారి, పిడిడిఆర్‌డిఓ సాంబశివ రావు, ఉద్యానవన శాఖ అధికారి నీరజ గాంధీ, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రూ. 2 లక్షలు రుణ మాఫీ చేస్తే, రాజకీయాలను నుంచి తప్పుకుంటా

హైదరాబాద్: రేవంత్ హామీ మేరకు ఒకే ఏడాది ఒకే దఫా రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా అని బిజెపి నాయకులు ఈటెల రాజేందర్ సవాల్ విసిరారు. సఫాయి కార్మికుల, వైద్య సిబ్బంది కాళ్ళు కడిగి కరోనా సమయంలో చేసిన సేవను గుర్తించిన వ్యక్తి నరేంద్ర మోడీ అన్నారు. కేంద్రం ఇస్తే తప్ప ఇళ్లు కట్టలేదు రేవంత్ రెడ్డి, పెన్షన్ ఇవ్వలేదు, జీతాలు ఇవ్వలేదు.. అందుకే వాళ్లకు ఓట్లు వేసి మనం అడుక్కోవడం ఎందుకు మనకే ఓట్లు వేసుకుందాం%ౌా% అన్నీ తెచ్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు. రామాయం పేటలోని రాజరాజేశ్వరి క్లస్టర్‌లో జరిగిన విజయ సంకల్ప యాత్రలో ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా మోడీ చేసిన పనులు చెప్పి మీ ఓటు అడిగేందుకు వచ్చామన్నారు. కెసిఆర్ ఇచ్చిన హామీలు, అమలుచేయడంలో విఫలం అయ్యారన్నారు.



నిరుద్యోగభృతి ఇవ్వలేదు, రుణమాఫీ చేయలేదు, డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తాం, పెన్షన్‌లు ఇస్తాం వంటి హామీలు నెరవేర్చక పోగా కనీసం వేతనాలు కూడా సరిగా ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. ఇవన్నీ తెలిసి కూడా 'నాకు ఓటు వేయండి' అని రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారన్నారు. 'నాలుగు వేల పెన్షన్ ఇస్తా, వికలాంగులకు 6 వేలు, ప్రతి ఆడబిడ్డకు రూ ,2500లు అందచేస్తా, రైతులకు రూ,2 లక్షల రుణమాఫీ చేస్తా' అని సిఎం రేవంత్ బూటకపు హామీలు ఇచ్చారని ఆయన ఆరోపించారు.మహిళలకు 10 లక్షల రూపాయలు వడ్డీలేని రుణాలు, 15 వేల రైతుబంధు, 12 వేల కౌలు బంధు, వారికి 500 రూ. బోనస్ ఇలా అనేక హామీలు ఇచ్చారని, కానీ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కెసిఆర్ కంటే ఎక్కువ అబద్దాలు చెప్పింది సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

'మోడీ వచ్చాక.. జమ్మూ కాశ్మీర్ లో బుల్లెట్ గాయాలు లేవు, దేశంలో మతకలహాలు లేవు, బాంబుల మోతలు లేవన్నారు. భారత దేశానికి వచ్చిన గుర్తింపుకు కారణం నరేంద్ర మోడీ' అని అందుకే కమలం పువ్వు గుర్తుకు ఓటు వేద్దాం, మళ్ళీ మోడీని ప్రధానిని చేసుకుందామని పిలుపు నిచ్చారు. ఎరువుల మీద సంవత్సరానికి ఎకరానికి 18 వేల రూపాయల సబ్సిడీ ప్రధాని అందిస్తున్నారని, రూ.6300 కోట్లతో రామగుండం కర్మాగారం తెరిచి ఎరువుల కోసం లైన్లు కట్టే బాధ తప్పించారన్నారు.ఈ కార్యక్రమంలో బోడిగ శోభ, రాణి రుద్రమ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి వద్ద ఘనంగా అన్నదానం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం జరిగింది. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్ పేట కు చెందిన వాసగోని గణేశ్ గౌడ్ - సువర్ణ - దంపతులు రూ.1000, గుల్యా గారి బాలరాజ్ గౌడ్ – అమృత దంపతులు రు. 1100, దూడల బాలరాజ్ గౌడ్ – మణేమ్మ దంపతులు కూరగాయలు, చిరంజీవి చారి కుటుంబ సభ్యులు రూ .1000 రూపాయలు, బండి బాలరాజ్ గౌడ్-మహేశ్వరి దంపతుల రూ.501, యాస్కి శోబన్గౌడ్ - వసంత దంపతులు రూ.501, బండి నేహా గౌడ్ కుటుంబ సభ్యుల రూ. 501 అందజేయగా ఆలయ కమిటీ తరఫున అన్నదానం చేశారు. తూముకుంటకు చెందిన కాలం సోమేశ్వర్ రావు – రజిని దంపతులు స్వీటును అమ్మవారికి సమర్పించి భక్తులకు అందజేశారు.ఉమ్మడి శామీర్ పేట మండలం కు చెందిన భక్తులు, రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# రాడిసన్... డ్రగ్స్ డెన్



డ్రగ్స్ పార్టీ నిర్వహించిన రాడిసన్ హోటల్‌లో మాదాపూర్ ఎస్ఓటి, గచ్చిబౌలి పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, ఆరుగురు పరారీలో ఉన్నారు. ఇందులో ఇద్దరు యువతులు ఉన్నారు. వారి వద్ద నుంచి ప్లాస్టిక్ కవర్లు, వైట్ కలర్ పేపర్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదాపూ ర్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి వివరాలు వెల్లడించారు. బిజెపి నాయకుడు యోగానంద్ కుమారుడు, వ్యాపారవేత్త గజ్జల వివేకానంద్, సయిద్ అబ్బాస్ అలీ జెఫ్రీ, నిర్భవ్, కేదార్, సందీప్ సెలబ్రిటీ శ్వేత, లిశి, నీల్, నిర్భయ, రఘు, చరణ్ కలిసి కొకైన్‌తో రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ చేసుకున్నారు. అబ్బాస్ గతంలో వివేకానంద్ వద్ద పనిచేయడంతో అతడి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి తన స్నేహితులతో పార్టీ చేసుకున్నాడు. వీరు కొకైన్‌ను పేపర్‌లో చుట్టి డ్రగ్స్ తీసుకున్నారు. రాడిసన్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. కానీ అప్పటికే డ్రగ్స్ తీసుకున్న వారు ఇంటికి వెళ్లిపోయారు. దీంతో వెంటనే పోలీసులు రాడిసన్ హోటల్ యజమాని, మంజీరా గ్రూప్ డైరెక్టర్ గజ్జల వివేకానంద ఇంటికి వెళ్లారు. జూబ్లీహిల్స్‌లోని వివేకానంద ఇంటికి పోలీసులు వెళ్లడంతో వారిని లోపలికి రాకుండా కొద్దిసేపు అడ్డుకున్నారు. తర్వాత పోలీసులు ఇంటి లోపలికి వెళ్లి వివేకానందను అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్భయ్, కేదార్‌ను కూడా అదుపులోకి తీసుకుని మూత్ర పరీక్ష చేయడంతో పాజిటివ్ వచ్చింది. వారిని అరెస్టు చేసి, మిగతా వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేదార్ నగరంలో ఉన్న హై లైఫ్, జూబ్లీ 800 పబ్‌లకు యజమానిగా వ్యవహరిస్తున్నాడు. అలాగే ఈ రెండింటితోపాటు బఫెలో వైల్డ్ వింగ్స్ అనే పబ్‌లో కూడా అతను బిజినెస్ పార్టనర్‌గా ఉన్నట్లు తెలిసింది. వివేకానంద్, నిర్భయ్, కేదార్‌పై 121బి, 27, ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ విక్రయించి సంపాదించిన ఆస్తులను కూడా అటాచ్ చేస్తామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు.

గతంలో పార్టీలు..

రాడిసన్ హోటల్‌లో వివేకానంద్ గతంలో డ్రగ్స్ పార్టీలు చేసుకున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. వీరికి సయ్యద్ అబ్బాస్ డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వివేకానంద్ గతంలో సినీనటులకు కూడా డ్రగ్స్ పార్టీ ఇచ్చినట్లు తెలిసింది. పోలీసులు ఆ కోణంలో కూడా విచారణ చేయనున్నట్లు తెలిసింది. కాగా గతంలో వివేకానంద్ తండ్రి యోగానంద్ గంజాయిపై చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరలవుతోంది. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా వివినగర్ డివిజన్‌లోని రామకృష్ణానగర్‌లో పర్యటించానని, అక్కడి ప్రజలు గంజాయి, ఈవ్ టీజింగ్‌పై ఫిర్యాదు చేశారని, పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పారని ట్వీట్‌ను అప్పటి డిజిపి మహేందర్‌రెడ్డికి ట్యాగ్ చేశారు.

# 3 నెలల క్రితమే పెళ్లి.. భర్త బాధ తట్టుకోలేక మూడో అంతస్తు పైనుంచి దూకిన నవ వధువు!



మూడు నెలల క్రితమే వైభవంగా వివాహమైంది. ఇంకా బంధు మిత్రుల శుభాకాంక్షల్లోనే మునిగి తేలుతున్నారు ఆ నవ దంపతులు. ప్రేమ పక్షుల్లా కలిసిపోయిన ఆ జంటను చూసిన విధి ఓర్వలేకపోయిందేమో.. అప్పుడే ఒకరిని కాటికి చేర్చి, మరొకరిని చావుబతుకుల మధ్యకు నెట్టింది. పచ్చని తోరణాలు కూడా ఆరని ఆ ఇంట్లో చావు డప్పు మోగింది. భర్త హఠత్ మరణంతో భార్య ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన ఘజియాబాద్‌లో వెలుగులోకి వచ్చింది.

కౌశాంబి పోలీస్ స్టేషన్ పరిధిలోని వైశాలి చౌకీ సెక్టార్ 3 ఎల్కాన్ అపార్ట్‌మెంట్‌లోని ఏడవ అంతస్తులో అభిషేక్ అహువాలియా (28) ఆయన భార్య అంజలి (22) ఉంటున్నారు. వీరిద్దరికి మూడు నెలల క్రితమే పెళ్లి అయింది. సోమవారం నవ దంపతులు ఇద్దరు కలిసి ఢిల్లీ జంతుప్రదర్శనశాలకు వెళ్లారు. అక్కడ ఆమె భర్త అభిషేక్‌కు హఠత్తుగా ఛాతీనొప్పి వచ్చింది. కంగారు పడిన అంజలి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించింది. అభిషేక్ అహువాలియాను పరీక్షించిన వైద్యులు.. గుండెపోటుకు గురై అప్పటికే మృతి చెందాడని ప్రకటించారు. షాక్‌కు గురైన అంజలి భర్త మృతదేహంతో సాయంత్రం ఇంటికి వచ్చింది.

భర్త మరణంతో తీవ్ర బాధలో మనస్థానం చెందిన ఆమె ఏడవ అంతస్తు బాల్కనీ నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే గుర్తించిన కుటుంబసభ్యులు తీవ్రగాయాలపాలైన అంజలిని సమీపంలో ఉన్న మాక్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది.

# డిజిపిని కలిసిన బిఆర్ఎస్ మహిళా నేతలు



హైదరాబాద్ : బిఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా నేతలు కొందరు డిజిపి రవి గుప్తాను కలిశారు. ఇల్లందు మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లపై జరిగిన దాడి, కిడ్నాప్ ల సంఘటనల విషయంలో దోషులపై వెంటనే చర్యలు తీసుకోవాలని నేతలు డిజిపి రవి గుప్తాను కోరారు. ఈ మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఇల్లందు మాజీ ఎంఎల్ఎ బానోత్ హరిప్రియ నాయక్ తదితరులు మంగళవారం డిజిపిని హైదరాబాద్ లో కలిశారు.

డిజిపి రవి గుప్తాను కలిసి పూర్తి ఆధారాలతో బిఆర్ఎస్ మహిళలు ఫిర్యాదు చేశారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లపై కాంగ్రెస్ నేతలు దాడులు చేశారని, కిడ్నాప్‌లు కూడా చేశారని ఆరోపించారు. ఆ ఘటనల విషయంలో నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల జరుగుతున్న మహిళలపై దాడుల విషయంలోనూ చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న దాడులపై సమగ్ర విచారణ చేయాలని డిజిపికి ఇచ్చిన వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. చర్యల కోసం ఆయా జిల్లాల ఎస్‌పిలకు తగిన ఆదేశాలివ్వాలని డిజిపిని నేతలు కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జల్లా ఇల్లందు మున్సిపల్ ఆఫీస్ వద్ద ఫిబ్రవరి 5న తీవ్రమైన ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ చైర్మన్ దుమ్మాలపాటి వెంకటేశ్వరారావుపై అవిశ్వాస తీర్మానం పెట్టడం కోసం పాలకవర్గం ప్రత్యేకంగా సమావేశం కాగా దానిపై అనుకూలంగా ఓటు వేయడానికి 17 మంది కౌన్సిలర్లు అక్కడికి చేరుకున్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు మద్దతు తెలిపితే అవిశ్వాసం వీగిపోనుంది.

ఈ క్రమంలో కౌన్సిలర్లను ఎంఎల్ఎ కిడ్నాప్ చేయించారని ఆరోపణలు వచ్చాయి. మున్సిపల్ ఛైర్మన్‌పై బిఆర్ఎస్ పెట్టిన అవిశ్వాస తీర్మానం జరగకుండా ఎంఎల్ఎ కనకయ్య దగ్గరుండి అడ్డుకున్నారని చెబుతున్నారు. కౌన్సిలర్ నాగేశ్వర రావును కాంగ్రెస్ ఎంఎల్ఎ కోరం కనకయ్య బలవంతంగా తీసుకెళ్లగా, సిపిఐ కౌన్సిలర్‌ను ఆ పార్టీ నాయకులు తమ వెంట తీసుకెళ్లారు. మున్సిపల్ కార్యాలయానికి బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో అడ్డువచ్చిన మాజీ ఎంఎల్ఎ హరి ప్రియ నాయక్‌ను పక్కకు నెట్టి స్థానిక రౌడీల సాయంతో కొక్కు నాగేశ్వరావు కిడ్నాప్ చేయించినట్లుగా విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు.

# నైతిక నిష్ఠ లేని నరేంద్రుడు



ఏ నాయకుడైనా పార్టీని గెలిపించినంత కాలం ఆ పార్టీ కార్యకర్తలందరూ ఆయనను ఆకాశానికి ఎత్తుతూ ప్రశంసల వర్షం కురిపించడం సహజం. ఆ నాయకుడి పొరపాట్లను ప్రస్తావించడం, చేసిన పనులను విమర్శనాత్మకంగా సమీక్షించే సాహసం ఎవరికీ ఉండదు. వందిమాగధ సంస్కృతిని ప్రోత్సహించే విషయంలో భారతీయ జనతా పార్టీ అన్ని పార్టీలను మించిపోయింది. 'మీరు ప్రతిపక్షాలు చేసే విమర్శల జోలికి పోకండి.. మనమేమి చేశామో ప్రజలకు చెప్పండి చాలు.' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన భారతీయ జనతా పార్టీ జాతీయ సదస్సులో నేతలకు ఉద్బోధించారు. బీజేపీ జాతీయ సదస్సులో వక్తలందరూ మోదీని ఆకాశానికెత్తుతూ ప్రసంగాలు చేయడంలో పోటీ పడ్డారు. పేరుకు ప్రవేశపెట్టింది రాజకీయ, ఆర్థిక తీర్మానాలైనప్పటికీ అవి మోదీ అభినందన తీర్మానాలనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి పేరాలో కనీసం రెండుసార్లు మోదీ అన్న పేరు లేకుండా తీర్మానాలను లిఖించలేదు. 'ఈ ఎన్నికల్లో అభ్యర్థి ఎవరు పోటీ చేశారన్న దానితో ప్రమేయం లేదు. అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థి కమలమే.' అని మోదీ అన్నారు. కాని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థి మోదీయే అన్న విషయం పోటీ చేసే వారందరికీ తెలుసు. పార్టీ పేరుతో కాకుండా 'మోదీ గ్యారంటీ' పేరుతో ప్రధానమంత్రే స్వయంగా ప్రచారం చేసుకుంటున్నప్పుడు పార్టీ కన్నా నేతకే ఎక్కువ ప్రాధాన్యముంటుందన్న విషయం స్పష్టమే కదా! రెండు రోజుల జాతీయ సదస్సులో బీజేపీ నేతలకు స్పష్టమైంది ఒక్కటే. ఒక వైపు రామభజన చేస్తూనే మరో వైపు మోదీ భజన చేస్తే సరిపోతుందని వారికి అర్థమైంది. ఈ రెండే ఎన్నికల్లో గెలిచేందుకు తారక మంత్రమని నేతలంతా వారికి దిశా నిర్దేశం చేశారు. బీజేపీ ఒక్కటే ఎన్నికల్లో 370 సీట్లు గెలవాలని కూడా ప్రధానితో సహా నేతలంతా భారీ లక్ష్యాన్ని విధించారు. కాని 370 సీట్లు సాధించడం అంత కష్టమని వారికి కూడా తెలియనిది కాదు. పుల్వామా, బాలాకోట్ ఘటనల తర్వాత కూడా బీజేపీకి 303 సీట్లు దాటలేదు. మధ్యప్రదేశ్, గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, హర్యానా, హిమాచల్, మహారాష్ట్ర, ఢిల్లీ, జార?ండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్డీఏకు గతంలో అత్యధిక సీట్లు లభించాయి. ఈ సారి మళ్లీ అన్ని సీట్లు రావడంతో పాటు గతంలో ఓడిపోయిన స్థానాల్లోనూ బీజేపీ గెలవాలంటే దేశ వ్యాప్తంగా మోదీ ప్రభంజనం వీయాలి. రామమందిరం, మోదీ ఆకర్షణ, వికసిత్ భారత్ వంటి పదాలతోనే ఈ ప్రభంజనం వీస్తుందన్న నమ్మకం బీజేపీ నేతలకే ఉంటే అందుకు సంబంధించిన ప్రచారంతోనే ఊదరగొట్టి మౌనంగా ఉండేవారు. ఒక వేళ మోదీ గాలి అంతగా వీసే అవకాశాలుంటే ఇండియా కూటమి పేరుతో దేశంలో ఇతర పార్టీలన్నీ ఏకం అయినా ఆయనను ఏమీ చేయలేకపోయేవారు. 'మీరంతా ఒకవైపు, నేనొక్కడినీ మరో వైపు' అని మోదీ గతంలో పార్లమెంట్‌లో ఛాతీ కూడా చరుచుకున్నారు. అటువంటప్పుడు ప్రతిపక్షాలను కూడా ఛిన్నాభిన్నం చేసేందుకు, దేశంలో ఉన్న ప్రతి బీజేపీయేతర పార్టీని బలహీనపరిచి సామదానభేద దండోపాయాలతో వారిని వశపరుచుకునేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారు?

కేవలం తమ కంటే బాగా దేశాన్ని ఎవరూ అభివృద్ధి చేయలేరని, కాంగ్రెస్ పాలనలో దేశం భ్రష్టుపట్టిందనే ప్రచారాలతోనే ప్రజలను వశపరుచుకోలేమన్న అపనమ్మకం ఉండడమే అందుకు కారణమా? 'ప్రతిపక్ష నేతలను భయపెట్టడం ద్వారా మీరు వారిని మీ పార్టీలోకి ఎందుకు లాగుతున్నారు. ఇది మంచిదేనా? అని ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీని పార్లమెంట్‌లో ప్రశ్నించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. 'మేము ఎవర్నీ మా వైపు లాగడం లేదు, వారే వస్తానంటే మేమేం చేయగలం? మా ప్రభుత్వ పాలన చూసి ఆకర్షితులై మా పార్టీలోకి వస్తున్నారు' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జవాబు చెప్పారు. ఇందులో ఎంత నిజం ఉన్నదో చేరిన వారికి, చేర్చుకున్న వారికే తెలియాలి. గత ఏడాది జూలైలోనే ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఓబీసీ నేతల్ని బీజేపీలో చేర్చుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి పోటీ చేసిన శాలినీ యాదవ్ కూడా వీరిలో ఉన్నారు. సమాజ్‌వాది, బహుజన సమాజ్, ఆర్ఎల్‌డి పార్టీల నుంచి వలసలను ప్రోత్సహించడం బీజేపీ నిరంతరం చేస్తూనే ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 సీట్లను సాధించి సమాజ్‌వాది పార్టీ భవిష్యత్తును చెరిపేసేందుకు బీజేపీ కృతనిశ్చయంతో ఉన్నది. అంతేకాదు, దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను వశపరుచుకోవడమో, దెబ్బతీయడమో లక్ష్యంగా బీజేపీ ఎన్నో చర్యలు తీసుకుంది. బిహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు), కర్ణాటకలో జెడి(ఎస్), మహారాష్ట్రలో శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్‌సిపి (అజిత్ పవార్) బీజేపీ ఛత్రఛాయలోకి క్రమంగా వచ్చాయి. అకాలీదళ్, ఆర్ఎల్‌డి ఆ మార్గంలో ఉన్నాయి. మరికొన్ని పార్టీలకు కూడా ఈ మార్గాన్ని అవలంబించక తప్పని పరిస్థితి బీజేపీ కల్పించింది. ఇక ఇండియా కూటమిలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ, జెఎంఎం, తృణమూల్ కాంగ్రెస్‌లను భయ భ్రాంతులకు గురిచేసేందుకు రక రకాల శక్తులను ప్రయోగిస్తున్నారు. ఏ విధంగానైనా 2024 ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించేందుకు వీలుగా సాధ్యమైనంత మందిని తమ పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రతిపక్షాల్లోంచి ఎవరు వచ్చినా చేర్చుకునేందుకు బీజేపీ ఏకంగా ఉపాధి మేళాలే ప్రారంభించింది. ఈ ఉపాధి మేళాల్లో పోస్టుల సంఖ్య అపరిమితం. ఇక అప్లై చేసుకున్న వారి విషయంలో పెండింగ్‌లో ఉన్న ఆర్థిక నేరాలు, క్రిమినల్ కేసులు కూడా బుట్టదాఖలయే అవకాశాలున్నాయి. కేంద్ర సంస్థల దర్యాప్తులు నత్తనడకన సాగుతాయి. ఢిల్లీ పెద్దలు తలుచుకుంటే ఏ కేసులోనైనా ఉపశమనం లభిస్తుంది లేదా కొత్త కేసులు పుట్టుకొస్తాయి. కొందరికి చేరిన వెంటనే పదవులు లభిస్తాయి. జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్ర మంత్రి పదవి లభిస్తే, ఒకప్పుడు రాహుల్ గాంధీ కుడిభుజమైన యుపి నేత ఆర్‌పిఎన్ సింగ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, కాంగ్రెస్‌ను వదిలి షిండే శివసేనలో చేరిన మిలింద్ దేవరకు రాజ్యసభ పదవులు వరించాయి. బీజేపీలో ఉన్న వారికంటే కాంగ్రెస్ నుంచో మరో ప్రధాన పార్టీ నుంచో వచ్చిన వారికి మోదీ హయాంలో విలువ ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆపరేషన్ కమల్ ఆకర్షణకు ఎంతమంది లోనవుతారో చెప్పలేం. బీజేపీ రెండు రోజుల జాతీయ సదస్సులో రామమందిరంపై చేసిన తీర్మానం అత్యంత ముఖ్యమైనది. రామమందిర నిర్మాణానికి పూర్తి ఘనత మోదీకే దక్కిందని ప్రశంసల వర్షం కురిపించిన పార్టీ నేతలు ఆయనను గజమాలలతో సత్కరించారు. ఇక మోదీ హయాంలో రామరాజ్యం ఏర్పడుతుందని, అది వేయేళ్లు కొనసాగుతోందని ప్రత్యేకంగా తీర్మానించారు. అందరికీ భాగస్వామ్యం కల్పించే రామరాజ్యం కావాలని వారు అభిలషించారు. అంటే ఇతర పార్టీలనేతలందర్నీ నయానో భయానో చేర్చుకుని భాగస్వామ్యం కల్పించడమని ఈ తీర్మానం ఉద్దేశమా? రామరాజ్యం అనేది ప్రధానంగా నైతిక విలువలకు సంబంధించిన దృక్కోణం. కాని బీజేపీని రాజకీయంగా బలోపేతం చేసే అత్యధిక సీట్లు సాధించడమే పరమావధిగా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు చాలా కాలం నుంచి ఉన్నాయి. బెంగాల్‌లో సువేందు అధికారి నుంచి మహారాష్ట్రలో అశోక్ చవాన్ వరకు వందలాది నేతలు ఆర్థిక నేరాలకు పాల్పడినవారే. ముంబైలో కార్గిల్ యుద్ధ వీరుల కోసం నిర్మించిన ఆదర్శ్ హౌజింగ్ పథకంలోనే భారీ అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలు అశోక్ చవాన్‌పై ఉన్నాయి.

సైనికులు, వారి కుటుంబాలకే కాకుండా అనేక మంది ఇతరులకు, చివరకు తన కుటుంబ సభ్యులకు కూడా ఫ్లాట్లు కేటాయించుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అశోక్ చవాన్‌పై కేసు ఇంకా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. తాము అధికారంలోకి వస్తే అశోక్ చవాన్‌ను జైలుకు పంపిస్తామని నరేంద్రమోదీ పదేళ్ల క్రితమే ప్రకటించారు. కాని పదేళ్ల తర్వాత అదే అశోక్ చవాన్ బీజేపీలో చేరారు. అశోక్ చవాన్ మాత్రమే కాదు, ఎన్‌సిపిని చీల్చిన అజిత్ పవార్‌పై కూడా ఎన్నో కేసులు ఉన్నాయి. బీజేపీలో చేరితే ఎన్ని కేసులున్నా నిర్భయంగా ఉండవచ్చుననే ప్రచారం జరుగుతోంది. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45(ఏ)ను రద్దు చేస్తే సగం మంది బీజేపీ నేతలు ఆ పార్టీలో ఉండరని ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'నన్ను కూడా అవినీతి కేసులో ఇరికించారు కనుక బీజేపీలో చేరతానంటే చేర్చుకుంటారేమో?' అని తృణమూల్ నేత మహువా మొయిత్రా వ్యాఖ్యానించారు.

# విప్లవ కిశోరం చంద్రశేఖర్ ఆజాద్



నేడు సమాజంలో సామాజిక స్పృహ కొరవడుతోంది. చదువు, ఉద్యోగం, కుటుంబం తప్ప సమాజం, దేశం కోసం పని చేయాలనే తపన తగ్గిపోతోంది. నాకేంటి? అనే స్వార్థం ఆవరిస్తోంది. చుట్టూ అన్యాయం జరుగుతున్నా, నిర్బంధం కొనసాగుతున్నా స్పందించలేకపోతున్నాం. నిర్బంధాన్ని, అణచివేతను తన జీవితంలో ఏ కోశానా ఒప్పుకోని అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తి. ఇయ్యాల ఆయన జయంతి సందర్భంగా ఆ వీరుడి స్ఫూర్తిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మీ ఒంట్లో రక్తం మరగకుంటే, మీ నరాల్లో ప్రవహించేది నీరు అనుకోవాలి. యువతలోని ఉత్తేజం మాతృదేశం కోసం ఉపయోగపడకుంటే అది నిస్తేజమే. కాబట్టి మన దేశం స్వేచ్ఛ పొందాల్సిందే. స్వతంత్రం రావాల్సిందే. ఇందుకోసం నేను శత్రువు తూటాలకైన ఎదురొడ్డి నిలబడతాను అంటూ తెల్లదొరల పాలిట సింహ స్వప్నంలా మారిన సమర నినాదం చంద్రశేఖర్ ఆజాద్. భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీష్ వారి గుండెల్లో రైల్లు పరిగెత్తించిన ఈయన మన దేశం గర్వించదగ్గ అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా బావ్రా గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జులై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు. ప్రాథమిక విద్యను సొంత గ్రామంలోనే పూర్తి చేసిన ఈయన వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించారు. 1919లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్ ఆ తరువాత 1921లో మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికిగానూ ఈయన తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యారు. అయితే విచారణ సందర్భంగా కోర్టులో నీ పేరేంటి? అని మెజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నకు ఆయన పెద్ద శబ్దంతో ఆజాద్ అని అరచి చెప్పారు. ఇక అప్పటి నుంచి చంద్రశేఖర్ ఆజాద్‌గా ఆయన పేరు స్థిరపడిపోయింది. దేశ ప్రజల రక్షణ కోసం ధర్మ యుద్ధమే సరైనది గట్టిగా నమ్మినవారు ఆజాద్. సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవవాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారత దేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందేనని ఆయన బలంగా నిశ్చయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించి భగత్ సింగ్, సుఖదేవ్ తదితరులకు మార్గ నిర్దేశకుడిగా మారిపోయారు. ఆజాద్ 1926లో కకోరీ ట్రైన్ దోపిడీ, అదే సంవత్సరంలో వైశ్రాయి రైలును కాల్చివేయడం, లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగ తీర్చుకోవడానికి 1928వ సంవత్సరంలో లాహెూర్‌లో జె.పి. సాండర్స్‌ను హత్య చేయడం తదితర హింసాత్మక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఒకానొక దశలో ఆజాద్ బ్రిటీష్ పోలీసులకు సింహస్వప్నంలా నిలిచారు. పోలీసుల హిట్ లిస్ట్‌ను తయారు చేసుకున్న ఆయన వారిని చంపేదాకా వదిలిపెట్టలేదు. పదిహేనేళ్ల ప్రాయంలో అరెస్టయిన తరువాత బయటికి వచ్చి పోరాటంలో పాలుపంచుకున్న ఆజాద్ ఆ తరువాత తన మరణం దాకా కూడా ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. అయితే 1931, ఫిబ్రవరి 27వ తేదీన తన ఇద్దరు సహచరులను కలిసేందుకు అలహాబాదులోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టుముట్టారు.

ఆజాద్‌ను లొంగిపోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు లొంగకుండా, ఒక్కడే పోరాడుతూ ముగ్గురు పోలీసులను హతమార్చారు. అలసిపోయే దాకా పోరాడిన ఆయన చివరి క్షణం లో తన వద్ద మిగిలిన ఒకే ఒక్క బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని అశువులు బాశారు.

చివరి దాకా ఆజాద్‌ను ప్రాణాలతో పట్టుకోవాలని భావించిన బ్రిటీష్ పోలీసులకు సాధ్యంకాక చివరికి ఆయన మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చింది. ఎవరైనా తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుచుకున్నట్లయితే ఆజాద్‌కు పట్టినగతే పడుతుందని ప్రజల్ని, ఇతర పోరాటకారులకు హెచ్చరిక జారీ చేస్తూ వారు ఆజాద్ మృతదేహాన్ని బహిరంగ ప్రదర్శనకు ఉంచారు. అయితే ఆజాద్ మరణం ప్రజల్లో మరింత పట్టుదలను పెంచి, దేశభక్తిని రగిల్చింది. పోరాటంలోకి ఉరికేలా ప్రోత్సహించింది. సాయుధ శక్తులు తమ ప్రాణాలు అర్పించినా అలుపెరుగని పోరాటం చేసినా ప్రధానంగా అహింసాయుత పోరాటంగా రూపుదాల్చిన భారత స్వరాజ్య ఉద్యమం బ్రిటీష్ వారి అరాచక పాలనను నిట్టనిలువునా కూల్చివేసింది. భారత మాతను బ్రిటీష్ దాస్య శృంఖలాల నుంచి విడిపించిన ఎందరో వీరుల బలిదానం ఫలితమే నేటి మన స్వతంత్ర భారత దేశం. అయితే నేడు మన భారత దేశ జనాభా 140 కోట్లకు చేరింది. దేశ ప్రజల సగటు వయసు 29 సంవత్సరాలకు చేరుకుంది. అమెరికా, జపాన్, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోలిస్తే అత్యంత యువ సంపన్న దేశంగా భారత్ నిలిచింది. మన దేశంలో 64% మంది యువతే ఉన్నారు. అయితే నేటి తరం యువతలో పరమత సహనం, దేశభక్తి, నైతిక విలువలు క్షీణించాయి. ఆజాద్ స్ఫూర్తితో దేశం కోసం, సమాజం కోసం ముందుకు కదలాలి.

# 13వ రోజు కొనసాగిన రైతుల ఆందోళన

**న్యూఢిల్లీ :** రైతుల పండించిన అన్ని పంటలకూ సి2ప్లస్50 శాతంతో కూడిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) చట్టం చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని, రైతులకు బీమా, పెన్షన్ సదుపాయం కల్పించాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు చేస్తున్న ఆందోళన 13వ రోజుకు చేరింది. ఆదివారం హర్యానా-పంజాబ్ సరిహద్దులు శంభు, ఖానౌరీ ప్రాంతాల్లో చేస్తున్న ఆందోళనల్లో భారీ సంఖ్యలో రైతులు, వివిధ తరగతుల ప్రజలు చేరారు. అందులోనూ మహిళలు ఎక్కువ మంది ఆందోళనలో భాగమయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించిన ఐదో రౌండ్ చర్చలకు తేదీ ఖరారు కాలేదు. దీంతో రైతులు తమ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. పోలీసుల కాల్పుల్లో యువ రైతు మరణం నేపథ్యంలో 29 వరకు సరిహద్దుల్లోనే రైతులు తమ ఆందోళన కొనసాగించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు కాల్పులు జరిపిన పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో ఆ యువ రైతుకు పోస్టుమార్టానికి రైతు సంఘాలు, కుటుంబ సభ్యులు అనుమతించలేదు.



## ఫ్రాన్స్‌లో రైతుల ఆందోళన ఉధృతం...!



**పారిస్ :** పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల ఆదాయం పెరిగేలా చూడాలని, వ్యవసాయ ప్రతికూల పర్యావరణ చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఫ్రెంచ్ రైతులు గత కొన్ని రోజులుగా చేస్తున్న ఆందోళన అంతకంతకూ తీవ్రతరమవుతోంది. రైతుల డిమాండ్లను పరిష్కరించకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు వ్యవసాయ ప్రదర్శనను ప్రభుత్వం అట్టహాసంగా పారిస్‌లో ఏర్పాటుచేసింది. రైతులు ఈ ఎగ్జిబిషన్‌ను కూడా ఆందోళన కేంద్రంగా మార్చారు. ఎగ్జిబిషన్‌ను సందర్శించాల్సిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ నిరసనలకు భయపడి తన పర్యటనను రద్దు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం సెంట్రల్ పారిస్‌లో రైతులు భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఫ్రాన్స్‌లోకి ఇయు వ్యవసాయోత్పత్తులను డంప్ చేయడాన్ని ఆపాలని ఫ్రెంచ్ రైతులు నినదించారు.

## అలెక్సీ నవాల్ని మరణం.. వెలుగులోకి సంచలన విషయం



**మాస్కో :** ఇటీవల రష్యా జైలులో వివాదాస్పద స్థితిలో మరణించిన పుతిన్ రాజకీయ ప్రత్యర్థి, రష్యా ప్రతిపక్షనేత అలెక్సీ నవాల్ని మృతికి సంబంధించి సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. నవాల్నిని జైలులో గుండెపై ఒకే ఒక్క గుద్దు గుద్ది చంపేసి ఉంటారని మానవహక్కుల కార్యకర్త వ్లాదిమిర్ ఒసెచిన్ తెలిపారు. ఇది రష్యా గూఢచారి సంస్థ కేజీబీ వేగులు చేసిన హత్యే అయి ఉండొచ్చన్నారు. కేజీబీ ప్రత్యేక వేగులకు మనుషులను గుండెపై ఒకే ఒక్క గుద్దు గుద్ది చంపేయడంపై శిక్షణ ఇస్తారని చెప్పారు. ఇది వారి హాల్‌మార్క్ హత్య చేసే విధానమని తెలిపారు. ఈ హత్య చేసే ముందు నవాల్ని శరీరాన్ని బలహీపర్చే ఉద్దేశంతో జీరో డిగ్రీ కంటే తక్కువ ఉష్ణోగ్రతలో అతడిని ఉంచారన్నారు. ఇలా చేయడం వల్ల మనిషిలో రక్తప్రసరణ నెమ్మదిస్తుందని చెప్పారు. అనంతరం గుండెపై గుద్ది చంపేస్తారన్నారు. కాగా, గత వారం ఆర్కిటిక్ పోలార్ వోల్ఫ్‌లోని పీనల్ కాలనీ జైలు అలెక్సీ నవాల్ని వివాదాస్పద స్థితిలో మృతి చెందారు. జైలులో సాయంత్రం వేళ కొద్దిసేపు వాకింగ్ తర్వాత నావల్ని ఇబ్బందిగా ఫీలయ్యారని, అనంతరం ఆయన కుప్పకూలారని జైలు అధికారులు వెల్లడించారు. అత్యంత వివాదాస్పదంగా మారిన నావల్ని మృతిపై రష్యాలో ఆయన అభిమానుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. ప్రపంచవ్యాప్తంగా అమెరికా సహా పలు దేశాధినేతలు నవాల్ని మృతికి పుతినే కారణమని పరోక్షంగా వ్యాఖ్యానించాయి. నవాల్ని భార్య, కూతురును అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాలిఫోర్నియాలోని ఓ హోటల్‌లో కలిసి పరామర్శించారు. అనంతరం గుండెపై గుద్ది చంపేస్తారన్నారు. కాగా, గత వారం ఆర్కిటిక్ పోలార్ వోల్ఫ్‌లోని పీనల్ కాలనీ జైలు అలెక్సీ నవాల్ని వివాదాస్పద స్థితిలో మృతి చెందారు.

## అమెరికాలో భారత సంతతి కంప్యూటర్ ఇంజినీర్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

టెక్సాస్: భారత సంతతికి చెందిన రీసెర్చర్ కంప్యూటర్ ఇంజినీర్‌ను అమెరికాలో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. టెక్సాస్‌లో అత్యున్నత అకడమిక్ అవార్డుగా పేరొందిన ఎడిత్ అండ్ పీటర్ ఓ డన్నెల్ అవార్డును ప్రొఫెసర్ అశోక్ వీరరాఘవన్‌కు అందజేశారు. ఈ అవార్డును ద టెక్సాస్ అకాడమీ ఆఫ్ మెడిసిన్, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ(టామ్‌సెట్)ఏటా అత్యుత్తమ పరిశోధనలు చేసిన వారికి ప్రతి ఏటా అందిస్తుంది. అశోక్ వీర రాఘవన్ హ్యూస్టన్‌లోని రైస్ యూనివర్సిటీకి చెందిన జార్జ్ ఆర్.బ్రౌన్ స్కూల్‌లో ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇమేజింగ్ టెక్నాలజీలో చేసిన పరిశోధనలకుగాను వీరరాఘవన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న సందర్భంగా వీరరాఘవన్ మాట్లాడుతూ 'అవార్డు అందుకున్నందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుత ఇమేజింగ్ టెక్నాలజీలో చాలా సమస్యలున్నాయి. కాంతి ప్రసరించకుండా అడ్డంకులున్నచోట మనకు కావాల్సిన వాటిని చూడలేకపోతున్నాం.



## ఏడోసారి కూడా ఇడి ఎదుట హాజరు కాని కేజ్రీవాల్



న్యూఢిల్లీ: లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కి ఇడి పలుమార్లు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా విచారణకు ఫిబ్రవరి 26వ తేదీ సోమవారం ఇడి ఎదుట హాజరు కావాలని ఫిబ్రవరి 22వ తేదీన సమన్లు జారీ చేసింది. అయితే వరుసగా ఏడోసారి కూడా అరవింద్ కేజ్రీవాల్ విచారణకు హాజరు కాలేదు. ఇక ఈ సందర్భంగా ఆప్ పార్టీ స్పందించింది. "ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. కేజ్రీవాల్‌కు పదేపదే సమన్లు జారీ చేసే బదులు కోర్టు నిర్ణయం కోసం వేచి ఉండాలి. తదుపరి విచారణ మార్చి 16న జరగనుంది. అప్పటివరకు ఈడీ ఓపిక పట్టాలి. కోర్టు నిర్ణయం కోసం వేచి ఉండాలి. మేం ఇండియా కూటమిని విడిచిపెట్టే ప్రసక్తి లేదు. మోడీ ప్రభుత్వం ఇలాంటి ఒత్తిడి చేయకూడదు' అని ఆప్ పేర్కొంది. ఈడీ ఇప్పటి వరకు ఏడుసార్లు కేజ్రీవాల్‌కు సమన్లు పంపించింది. తాజాగా ఫిబ్రవరి 22వ తేదీన పంపింది. గతంలో నవంబర్ 2న, డిసెంబర్ 21వ తేదీన ఈడీ సమన్లు జారీ చేసింది. అలాగే జనవరి 3న, జనవరి 13వ తేదీన విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపింది. ఈడీ నోటీసుల్ని కేజ్రీవాల్ పట్టించుకోలేదు. విచారణకు హాజరుకాలేదు. దీంతో జనవరి 31, ఫిబ్రవరి 14వ తేదీన కూడా ఈడీ నోటీసులు పంపింది. అయినప్పటికీ కేజ్రీవాల్ విచారణకు హాజరుకాలేదు. పైగా ఈడీ నోటీసులు అక్రమమంటూ కొట్టిపారేశారు.

## ఐఎన్ఎల్‌డి అధినేత నఫే సింగ్ దారుణ హత్య

**న్యూఢిల్లీ :** హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాష్ చౌతాలా స్థాపించిన ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డి) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, బహదూర్‌గఢ్ మాజీ ఎమ్మెల్యే నఫే సింగ్ రాఠీ దారుణ హత్యకు గురయ్యారు. బిజెపి పాలిత హర్యానాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. సార్వత్రిక ఎన్నికల వేళ అక్కడ హింసకు హద్దే లేకుండా పోతోంది. పట్టపగలే దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. నఫే హత్య అందుకు తాజా ఉదాహరణ. ఝుజ్జర్ జిల్లాలో ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై గుర్తు తెలియని దుండగులు కారులో వెంబడించి కాల్పులు జరిపి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో నఫే సింగ్‌తో పాటు మరో పార్టీ కార్యకర్త కూడా చనిపోయారు. ఇద్దరు వ్యక్తిగత గన్‌మెన్‌లు గాయపడ్డారు. కారులో వచ్చిన గుర్తుతెలియని దుండగులు నఫే సింగ్ కారుపై బుల్లెట్ల వర్షం కురిపించారని, దాంతో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. వీరిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నఫే సింగ్ మరణించినట్లు పేర్కొన్నారు. ఈ దాడి పక్కా ప్రణాళికతో జరిగినట్లు తెలుస్తోందన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. నఫే హత్య అందుకు తాజా ఉదాహరణ. ఝుజ్జర్ జిల్లాలో ఆయన ప్రయాణిస్తున్న వాహనంపై గుర్తు తెలియని దుండగులు కారులో వెంబడించి కాల్పులు జరిపి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో నఫే సింగ్‌తో పాటు మరో పార్టీ కార్యకర్త కూడా చనిపోయారు.



## సైన్యానికి పాక్ ఓటరు గుణపాఠం...

బ్రిటిష్ పాలకులు కుతంత్రంగా జరిపిన దేశ విభజన అనంతరం భారత దేశంతో పోల్చుకుంటే పాకిస్తాన్ పుష్కలమైన ఆర్థిక వనరులతో సంపన్న దేశంగా ఉండెడిది. అయితే, పలు కారణాల చేత సుపరిపాలన లోపించడంతో, పాలనా యంత్రాంగంపై సైనిక నాయకత్వం ఆధిపత్యం కొనసాగుతూ ఉండడంతో స్వతంత్రించి దేశాభివృద్ధి లక్ష్యంగా పని చేసే ప్రభుత్వాలు మనుగడ సాగించలేకపోయాయి. తరచుగా సైనిక తిరుగుబాటు, ఎన్నికలు జరిగినా సైన్యం చెప్పుచేతలలో ఉండేవారే ఎన్నికవుతూ ఉండటం, సైనిక నాయకత్వం తీవ్రమైన అవినీతితో ఉండడంతో దేశం ఆర్థికంగా ఛిన్నాభిన్నం కావడం జరుగుతూ వచ్చింది. మొదటి నుంచి ప్రభుత్వంపై తమ ఆధిపత్యం కొనసాగించడం కోసం భారత్‌ను ఒక బూచిగా చూపుతూ, తాము లేకపోతే భారత్ దురాక్రమణ చేస్తుందనే భయం సృష్టించే ప్రయత్నం సైనిక నాయకత్వం చేస్తూ వచ్చింది. సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు దిగడం ద్వారా భారత్‌తో సాధారణ సంబంధాలకు అవకాశం లేకుండా సైనిక ఉద్రిక్తలకు దోహదపడుతూ వచ్చారు. బెనజీర్ భుట్టో, నవాజ్ షరీఫ్ వంటి కొందరు ప్రధానులు భారత్‌తో మంచి సంబంధాలకు చొరవ తీసుకున్నప్పటికీ వారిని అర్ధాంతరంగా గద్దె దింపారు. చివరకు ప్రధాన మంత్రి ప్రమేయం లేకుండా సైన్యాధిపతిగా ముషారఫ్ కార్గిల్ దురాక్రమణకు సాహసించడం తెలిసిందే. సైన్యపు నిర్వాకం ఫలితంగా నేడు పాకిస్తాన్ ఒక 'రోగ్' దేశంగా, తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించే ప్రమాదకర దేశంగా, సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న దేశంగా అంతర్జాతీయంగా అపఖ్యాతి పాలయింది. నిత్యావసర వస్తువులు గగనమై, అప్పిచ్చేవారే లేక దేశం అలమటిస్తున్న సమయంలో ఫిబ్రవరి 8న జరిగిన ఎన్నికల్లో సైన్యం బలపరిచిన పార్టీలు, నేతలకు ఆ దేశ ప్రజలు ఓ విధమైన గుణపాఠం నేర్పారు. గత ఎన్నికల్లో సైనిక మద్దతుతోనే ప్రధాన మంత్రి పదవి చేపట్టి, ఆ తర్వాత సైన్యంతో పొసగక పదవి కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్‌ను జైలులో ఉంచినా, ఆయన పార్టీకి గుర్తింపు లేకుండా చేసినా, పెద్ద ఎత్తున రిగ్గింగుకు పాల్పడినా 101 మందిని స్వతంత్ర అభ్యర్థులుగానే గెలిపించి ప్రజాస్వామ్యం పట్ల ఆ దేశ ప్రజలు తమ స్పష్టమైన తీర్పు ఇచ్చారు. అయితే, ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో సుమారు రెండు వారాల పాటు తర్జనభర్జనలు పడిన తర్వాత చివరకు సంకీర్ణ ప్రభుత్వానికి మార్గం ఏర్పడింది. రాజకీయ విద్వేషాలను పక్కన పెట్టి అధికారం కోసం నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్- నవాజ్ (పిఎంఎల్-ఎన్), బిలావల్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. కేవలం తమకు ఎదురు తిరిగిన ఇమ్రాన్ ఖాన్‌ను రాజకీయంగా అంతం చేయడం కోసమే విదేశాలలో ఆశ్రయం పొందుతున్న నవాజ్ షరీఫ్‌ను దేశంలోకి రప్పించి, ఆయనపై ఉన్న కేసులను కొట్టి వేయించి, ఎన్నికల్లో పోటీపై ఉన్న ఆంక్షలను రద్దు చేయించి సైన్యం ఎంతగా మద్దతు ఇచ్చినప్పటికీ ప్రజా మద్దతు లభించలేదు. అనూహ్యమైన నగదు కొరతను ఎదుర్కొంటున్న పాకిస్తాన్ లో ఇప్పుడు ఎవరు ప్రధాని పదవి చేపట్టినా రాజకీయాలలో సైనిక జోక్యాన్ని ప్రజలు స్పష్టంగా తిరస్కరించారని ఫలితాలు వెల్లడి చేశాయి. గతంలో పలు పర్యాయాలు సైనిక తిరుగుబాటుతో సైన్యాధిపతులే దేశనాయకత్వం బాధ్యతలు చేపట్టారు. లేదా తమకు అనుకూలమైన కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పరిచారు. అయితే రాజకీయాలలో సైన్యపు ప్రత్యక్ష జోక్యం కారణంగా పాకిస్తాన్ అభివృద్ధిలో అధ్వానస్థితికి చేరుకొన్న వాస్తవాన్ని ఆ దేశ ప్రజలు ఇప్పుడు గ్రహించారు. దేశ రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆంతరంగిక భద్రత అంశాలను ఎవ్వరు ప్రభుత్వంలో ఉన్నా సైనిక కనుసన్నలలో నిర్వహిస్తూ ఉండడం ఆ దేశాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తున్నట్లు స్పష్టమైనది. అంతర్జాతీయంగా ఆ దేశ ప్రతిష్ఠ ఎన్నడూ లేనంతగా దిగజారింది. చివరకు అరబ్ దేశాలలో సహితం పాకిస్తాన్ పలుకుబడి సన్నగిల్లుతున్నది. పాకిస్థాన్‌లో ఏ ప్రధాన మంత్రి కూడా ఐదేళ్ల పూర్తి కాలాన్ని పూర్తి చేయలేకపోవడానికి సైన్యం జోక్యమే కారణం అని చెప్పవచ్చు. 1958లో పాకిస్తాన్ తన మొదటి సైనిక తిరుగుబాటును చూసింది. జనరల్ అయూబ్ ఖాన్ ప్రెసిడెంట్ ఇస్కాందర్ మీర్జా నుండి అధికారాన్ని చేజిక్కించుకున్నాడు, తరువాతి అతనిని ఆర్మీ స్టాఫ్ చీఫ్‌గా నియమించాడు. అయూబ్ ఖాన్ మార్షల్‌లా విధించి 1969 వరకు దేశాన్ని పాలించాడు. 1971లో భారత్‌పై జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ ఓడిపోయిన తర్వాత, జుల్ఫికర్ అలీ భుట్టో 1970లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధ్యక్షుడయ్యాడు. మూడు సంవత్సరాల తర్వాత ప్రధాన మంత్రి అయ్యాడు. జుల్ఫికర్ 1977లో ఎన్నికలలో మళ్లీ గెలిచాడు. కానీ అదే సంవత్సరంలో జనరల్ జియా-ఉల్-హక్ చేత పదవీచ్యుతుడయ్యాడు. జియా మార్షల్‌లా విధించారు. జాతీయ, అన్ని ప్రొవిన్షియల్ అసెంబ్లీలను రద్దు చేశారు. రాజ్యాంగాన్ని సస్పెండ్ చేశారు. జుల్ఫికర్‌ను జైలులో ఉంచి, ఉరి తీశారు. 1988లో విమాన ప్రమాదంలో జియా మరణించిన తర్వాత, బెనజీర్ భుట్టో ఆధ్వర్యంలో పిపిపి తిరిగి అధికారంలోకి వచ్చింది. 1999 వరకు పిఎంఎల్-ఎన్ , పిపిపిల మధ్య అధికార పోరు కనిపించింది. వీరిలో ఎవరూ పదవీకాలం పూర్తి చేయలేదు. 1999లో రక్తరహిత తిరుగుబాటులో నవాజ్ షరీఫ్‌ను జనరల్ పర్వేజ్ ముషారఫ్ తొలగించి బహిష్కరించారు. తదుపరి తిరుగుబాట్లు లేనప్పటికీ పాకిస్తాన్ సైన్యం ప్రభుత్వాలను పరోక్షంగా పర్యవేక్షించడంపై దృష్టి సారించింది. సైనిక ప్రాయోజిత ప్రభుత్వాన్ని సృష్టించే ప్రయత్నంలో ముషారఫ్ పిఎంఎల్-ఎన్, పిపిపిలను నిషేధించారు. పాకిస్తాన్‌లోని రాజకీయ పార్టీలు సైన్యపు ఆధిపత్య ధోరణి పట్ల అసహనంతో ఉంటూ ఉన్నప్పటికీ బలహీనమైన ఆర్థిక పరిస్థితి, ఏకాభిప్రాయం లేకపోవడం కారణంగా సైనిక ప్రయత్నాలను నిరోధించలేకపోతూ వస్తున్నారు.

# పుచ్చకాయను గమనించకుండా తిన్నారంటే....!



వేసవి దగ్గరకు వచ్చింది.. ఈ సీజన్‌లో ఎక్కువ డిమాండ్ ఉండేది పుచ్చకాయలకు.. ఎక్కడ చూసిన మనకు అవే పండ్లు కనిపిస్తాయి. ఎందుకంటే వేసవి తాపాన్ని, దాహాన్ని తీర్చేందుకు అద్భుతమైన ఫలం పుచ్చకాయ. ఎండ కారణంగా మన శరీరంలో వాటర్ లెవెల్స్ మాటిమాటికీ తగ్గిపోతూ ఉంటాయి. డీహైడ్రేషన్ స్టేజ్‌కి వెళ్లిపోతూ ఉంటాం. ఇలాంటప్పుడు వడదెబ్బ తగిలి కళ్ళు తిరిగి కింద పడిపోతాం.. చెప్పలంటే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే బాడీలో వాటర్ లెవెల్స్, షుగర్ లెవెల్స్ తగ్గిపోకుండా ఉండేందుకు పుచ్చకాయ ముక్కలు తినడం బెస్ట్ ఆప్షన్ అంటున్నారు డాక్టర్లు. కానీ ఈ పండులో చాలా రకాల రసాయనాలు కలుపుతున్నారు. 1. మార్కెట్‌లో ఎర్రగా నిగనిగలాడే అన్ని పుచ్చకాయలు మంచివే అనుకొకండి. ఎందుకంటే అవి అంత ఎర్రగా.. తీయగా పండేందుకు వాటిలో కార్బైడ్‌ను కలుపుతారు. ఇది ఇథనాల్ వాయువును ఉత్పత్తి చేస్తుంది. దీని ఫలితంగా పండ్లు త్వరగా పండుతాయి. అలాగే త్వరగా పక్వానికి రావడానికి, రంగు కోసం సుడాన్ రెడ్, మిథనాల్ ఎల్లో, మెర్క్యూరీ క్రోమెట్ వంటి రసాయనాలు కూడా ఉపయోగిస్తున్నారు అనీ ఆహార నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పండ్లు ఆరోగ్యానికి చాలా హానికరం. 2. పండిన పుచ్చకాయ గింజలు చాలా చిన్నవిగా ఉంటాయి. అదే సహజంగా పండిన పుచ్చకాయ పండ్ల గింజలు నల్లగా ఉంటాయి.. పెద్దగా ఉంటాయి. ఇలా మనం నకిలి పండుగా గుర్తించవచ్చు. కట్ చేసిన పండు గుజ్జు రంగులో తేడా ఉంటుంది.. కోసినప్పుడు విడిపోతే ఆ పుచ్చకాయలో కెమికల్ కంటెంట్ ఉందని చెప్పవచ్చు. ముక్కలుగా కట్ చేసినప్పుడు గుజ్జుగా కింద పడుతూ ఉంటే అది సరైనది కాదని అర్థం. 3. కొనేముందు ఓపికగా పుచ్చకాయని పరిశీలిస్తే అందులో కెమికల్ కలిపారో లేదో కట్ చేయకపోయిన తెలుసుకొవచ్చు. ఎలా అంటే పుచ్చకాయలో సూదితో పొడిచిన చిన్న రంధ్రం చేసి ఆ రంధ్రం లోంచి కెమికల్‌ని పండులోకి పంపుతారు. ఒక వేల మనం దాని గమనించి అమ్మేవారిని అడిగిన ఈ విషయం ఒప్పుకోరు. అందుకే కోనే ముందు పుచ్చకాయని చూట్టురా మొత్తం గమనించి తీసుకొండి. 4. పుచ్చకాయ పండ్లు ఆకు పచ్చ.. అలాగే ఆకు పచ్చ చారలతో కనిపిస్తాయి. కొన్నింటి పై తెల్లటి పెద్ద పెద్ద మచ్చలు కనిపిస్తాయి.

# వీటిని తింటే ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉంటారు?



మనం ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలం. ఇప్పుడు ఉన్న ఆరోగ్య సమస్యల వల్ల చాలామంది రైస్ ని అవాయిడ్ చేసి ఎక్కువగా సిరి ధాన్యలు చిరు ధాన్యలు తినడం అలావాటు చేసుకుంటున్నారు. నిజానికి ఇవి మన తాత ముత్తాతల కాలంలో బాగా తినేవారు. అందుకే వాళ్ళ దగ్గరకి అనారోగ్యం దరి కాదు. అప్పటివాళ్ళు వీటిని తినడం వల్ల పుష్టిగా బలంగా ఉండేవారు. ఎంత కష్టపడి ఎండలో పొలం పనులు చేసిన అలసిపోయేవాళ్ళు కాదు. అప్పటి కాలంలో సంతానం కూడా ఎక్కువే, కనీసం ఐదుగురు నుండి పది పదిహేను అంతకన్నా ఎక్కువ సంతానం ఉండేది, ఇప్పుడు తింటున్న తిండికి ఒకరిద్దరితో సరిపోతుంది, ఈ తిండి తినటం వల్ల మన తాత ముత్తాతలు వంద నుండి నూటాయాభై సవత్సరములు బ్రతికే వారు. ఇప్పుడు తింటున్న తిండికి అరవై సవత్సరములకె కాలం గడిచిపోతుంది. మరి అప్పటికి ఇప్పటికి ఎంత తేడానో చూసారా. అంతా మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యం.

అయితే ఈ చిరు ధాన్యలలో కొర్రలు గురించి వాటిని తినడం వల్ల వచ్చే లాభాల గురించి తెలుసుకుందాం. కొర్రలు, అండుకొర్రలు, సామాలు, అరికెలు, ఊదలు. ఓరిగలు, మొతం ఆరు రకాలు. కొర్రలు రుచికి కొంచెం వగరుగా ఉంటాయి. దీనిలో కాల్షియం, మాంసకృతులు, ఎక్కువ మొతాదులో ఉంటాయి. వీటిని వండుకొనే ముందు ఐదు గంటలు నానబెట్టుకోవాలి, అరుగుదల తక్కువ, అంత త్వరగా ఆకలి వేయదు. శరీరంలో ఎముకలు బలంగా దృడంగా తయారవుతాయి. కడుపుతో ఉన్నవారికి, పెరిగే పిల్లలకి ఇవి చాలా మంచిది. ఈ కొర్రలలో ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, పుష్కళంగా లభిస్తుంది. పొట్ట సమస్యలు కానీ ప్రేగు సమస్యలు కానీ ఉంటే ఈ కొర్రలు తినడం వల్ల వాటికి చెక్ పెట్టొచ్చు. బరువు తగ్గడం లో సహాయపడుతుంది. షుగరు వ్యాధిని కంట్రోల్ చేస్తుంది. రక్తం హీనతను తగ్గించి కణాలని మెరుగుపరిస్తుంది. ఇలాంటి మరెన్నో మంచి గుణాలు కలిగిన ఈ చిరు ధాన్యం తీసుకోవడం వల్ల నిత్యం యవ్వనంగా ఉంటారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు దగ్గరికి రావు. కనుక చిన్నవారి నుండి పెద్దవారి వరకు వీటిని వారానికి రెండు లేదా మూడు సార్లు తీసుకోవడం వల్ల మన ఆయుష్షుని పెంచుకోవచ్చు.

# మీ పిల్లలు హైట్ పెరగాలా...!



హైట్‌గా ఉన్నవారు చాలా అట్రాక్టివ్‌గా ఉంటారు. వారిని చూస్తే చాలు కడుపు నిండిపోతుంది వారి పిల్లలకు. ఇక పిల్లల్లో ఎదుగుదల అనేది చాలా ముఖ్యమైనది. కొంత మంది పిల్లలు ఏం తినకపోయినా త్వర త్వరగా హైట్ పెరుగుతూ ఉంటారు, మరికొంత మంది మాత్రం చాలా పొట్టిగా ఉంటారు. ఎంత తిన్నా, వారు పొట్టిగానే ఉంటారు. తమ పిల్లల ఎదుగుదల సరిగా లేకపోతే ఆ పేరెంట్స్ చాలా ఆందోళనకు గురి అవుతుంటారు. వారు హైట్ పెరగడానికి మార్కెట్‌లో లభించే వివిధ రకాల ప్రొటిన్ పౌడర్ తీసుకొచ్చి వారికి తాగిపిస్తూ ఉంటారు. అయితే ఇలా మార్కెట్లో లభ్యమయ్యే పౌడర్స్ వల్ల పిల్లల ఊబకాయంతో, చిన్న వయసులోనే అనేక రకాలైన సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుందంటున్నారు నిపుణులు. అందువలన పిల్లలు ఆరోగ్యంగా దృఢంగా ఉండేందుకు ఇంట్లోనే ప్రోటీన్ పౌడర్ తయారు చేసుకోవాలంట. 50 గ్రాముల నువ్వులు, 200 గ్రాముల మఖానా, 100 గ్రాముల బాదం, 100 గ్రాముల సొంపు తీసుకుని వీటిని చిన్న మంటపై బాగా వేయించుకోవాలి. ఇవి కాస్త చల్లారిన తర్వాత, ఒకేసారి మిక్సీలో వేసి మెత్తని పొడిలా చేసుకోవాలి. ఇక ఇది వేడికాస్త తగ్గాక ఓ బాక్స్‌లో స్టోర్ చేసుకొని, రోజూ ఉదయం పాలలో కలిపి ఇవ్వాలంట. దీంతో మీ పిల్లలు ఈజీగా హైట్ పెరుగుతారు.

# ఈ గింజలతో మలబద్ధకానికి చెక్



మలబద్ధకంతో బాధపడేవారు మలవిసర్జన సమయంలో చాలా ఇబ్బందులు పడతారు. జీర్ణక్రియ ప్రక్రియ సరిగ్గా జరిగితే వారానికి కనీసం మూడుసార్లు లేదా రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలు సాధారణమైనవిగా పరిగణిస్తారు. అయితే మలబద్ధకం విషయంలో ప్రేగులలో ధూళి పేరుకుపోతుంది. ఇది పాస్ చేసేటప్పుడు ఇబ్బందిని కలిగిస్తుంది. అంతేకాదు ఛాతీలో మంట, బరువు, పేగు ఆరోగ్యం, తలనొప్పి, కడుపులో గ్యాస్, చర్మ సమస్యలు కూడా మొదలవుతాయి. చెడు ఆహారపు అలవాట్ల వల్ల ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. ఔషధాలను అన్ని సమయాలలో తీసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. అటువంటి పరిస్థితిలో ఇంటి నివారణలు చాలా ప్రభావవంతంగా పరిగణిస్తారు. మలబద్ధకాన్ని సకాలంలో పరిష్కరించకపోతే, ఈ సమస్య చాలా తీవ్రంగా మారుతుంది. ఇది చాలా ఇబ్బందిని కలిగిస్తుంది. పైల్స్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. చియా గింజలు మలబద్ధకం నుండి బయటపడటానికి చాలా ఉపయోగకరంగా పరిగణిస్తారు. కాబట్టి దానిని ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం. చియా విత్తనాలు చిన్న నల్ల ధాన్యాలు, వీటిలో ప్రోటీన్, ఇనుము, భాస్వరం, మాంగనీస్, సెలీనియం, కాల్షియం ఎక్కువ మొత్తంలో ఫైబర్ ఉంటాయి. ఇది కాకుండా విటమిన్ ఎ, విటమిన్ సి, ఇ, బి-1, బి-2, బి-3, బి-9 కూడా ఇందులో ఉన్నాయి. ఇది గ్లూటెన్ రహితమైనది. మలబద్ధకంతో బాధపడేవారికి దీని వినియోగం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. మలబద్ధకం నుండి ఉపశమనం పొందడానికి, ఒక గ్లాసు నీటిని వేడిచేసి, అందులో అర టీస్పూన్ చియా గింజలను జోడించండి. చియా గింజలు కొద్దిగా ఉబ్బినప్పుడు, దానికి కొద్దిగా తేనె కలపండి. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీటిని తీసుకుంటే, మలబద్ధకం నుండి చాలా ఉపశమనం పొందుతారు. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది మేలు చేస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారు ముఖ్యంగా జంక్ ఫుడ్, హెవీ ఫ్రైడ్ ఫుడ్స్, స్పైసీ వస్తువులకు దూరంగా ఉండాలని గుర్తుంచుకోవాలి. బొప్పాయి, నిమ్మరసం, కాలానుగుణ కూరగాయలు, పండ్లు వంటి మలం విప్పుటకు సహాయపడే వాటిని ఆహారంలో చేర్చండి.

# పళ్ళని ఆరోగ్యానికి సూపర్ టిప్స్...?



పళ్ళు ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే పండ్లను, కూరగాయలను ఎక్కువగా నమిలి తినాలి. ఇలా చేయడంవల్ల నోట్లో లాలాజలం ఎక్కువగా తయారవుతుంది. దీంతో నోట్లో ఉండే క్రిములు నశిస్తాయి. దంతాలపై పేరుకుపోయిన పసుపుదనం, పాచి తొలగిపోతాయి. అలాగే కాఫీ, టీ, రెడ్ వైన్ వంటి వాటిని తీసుకోవడం తగ్గించాలి. ఇవి దంతాలపై మరకలను ఏర్పరుస్తాయి. కనుక వీటిని తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. అదే విధంగా నీటిని ఎక్కువగా తాగాలి. నీటిని తాగడం వల్ల దంతాలపై మరకలు ఏర్పడకుండా ఉంటాయి. పళ్ళ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు తెల్లగా చేయడంలో ఆవాల నూనె మనకు ఎంతో సహాయపడుతుంది. ఆవాల నూనెలో ఉప్పు, పసుపు వేసి కలపాలి. తరువాత ఈ మిశ్రమంతో పళ్ళను శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దంతాలు మరియు చిగుళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. దంతాలు సహజంగా తెల్లగా మారతాయి. అదేవిధంగా స్ట్రాబెరీలను ఉపయోగించడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. స్ట్రాబెరీలను పేస్ట్ గా చేసి అందులో బేకింగ్ సోడా కలిపి దంతాలను శుభ్రం చేసుకోవాలి. స్ట్రాబెరీలలో ఉండే మాలిక్ యాసిడ్ దంతాలను తెల్లగా మార్చడంలో సహాయపడుతుంది. అలాగే రోజూ దంతాలను శుభ్రం చేసుకునే ముందు ఒక నిమిషం పాటు దంతాలను యాపిల్ సైడర్ వెనిగర్ తో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల దంతాలు తెల్లగా మారడంతో పాటు నోటి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. నిమ్మరసంలో బేకింగ్ సోడా వేసి పేస్ట్ లాగా చేసుకోవాలి. ఈ పేస్ట్ ను దంతాలపై రాసి కొద్ది నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తరువాత నీటితో సరిగ్గా శుభ్రం చేసుకోవాలి.

# ఈ కాఫీతో ఒంట్లోని కొవ్వు మైనంలా కరిగిపోతుందట..



నగరాల్లో నివసించే చాలా మంది ప్రజలు ఊబకాయంతో బాధపడుతూ ఉంటారు. పెరిగిన బరువు నేటి కాలంలోని ప్రధాన సమస్యలలో ఒకటి. ఒక నివేదిక ప్రకారం ప్రతి నాల్గవ వ్యక్తి ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారు. మీరు అధిక బరువుతో ఉంటే, మీరు ఇతర వ్యాధుల బారినపడే ప్రమాదం కూడా ఉందని అర్థం. అయితే బరువు తగ్గించుకునేందుకు ఎన్నో రకాల పద్దతులను అవలంభిస్తున్నారు ప్రజలు. కానీ అన్ని పద్దతులు అందరికీ సరిపోదు. ఇలాంటి క్రమంలోనే ఇప్పుడు ఓ చర్చ ప్రజల్లో ముందుకొస్తుంది. మరి ఇప్పుడు ఆ చర్చ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. కాఫీ తాగితే స్ట్రెస్ పోతుంది అని చాలా మందికి తెలుసు. అయితే కాఫీ తాగితే కొవ్వు కూడా తగ్గుతుందని మీకు తెలిసి ఉండదు. మితంగా కాఫీ తాగితే జీర్ణక్రియ మెరుగుపడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి మీరు మీ కాఫీలో వెన్నను జోడిస్తే కొవ్వు మైనంలా కరిగిపోతుందని నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గడానికి ఈ రెసిపీని కేక్స్, పేస్ట్రీలలో ఉపయోగిస్తారని నిపుణులు చెబుతున్నారు. కాఫీ నుండి బరువు తగ్గడానికి మీరు దానికి వెన్నని జోడించాలి. ఇది అనేక విధాలుగా సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది విదేశాల్లోనే కాకుండా భారతదేశంలో కూడా ఈ పద్ధతిని అవలంభిస్తున్నారట.

# ఈ లడ్డు ఒక్కటి తింటే చాలు ఏ సమస్య దరిచేరదు?



రోజు మనం తినే బ్రేక్ఫాస్ట్ లో మినపగుళ్ళు తప్పనిసరి. ఇడ్లీ, దోస, వడ, గారే, పునుగు, ఇలా ఏ బ్రేక్ఫాస్ట్ తీసుకున్న అందులో మినపగుళ్ళు తప్పనిసరి. ఇవి ముఖ్యపాత్ర వహిస్తాయి. మినపగుళ్ళు వాడటమే కాదు, వాటివల్ల కలిగే ప్రయోజనాలు కూడా తెలుసుకుందాం. మినపగుళ్ళు వేయటం వల్ల దోశలు కానీ ఇడ్లీ కానీ మృదువుగా వస్తాయి, మంచి రుచితో సాఫ్ట్ గా ఉండటం వల్ల ఇంకా ఎక్కువగా తినవచ్చు. ఇది లైట్ ఫుడ్ కాబట్టి కొంతమంది రాత్రుళ్ళు అన్నానికి బదులు ఇలా దోస ఇడ్లీలు తింటారు. ఈ మినప గుళ్ళలో ఐరన్ పుష్కళంగా ఉంటుంది. శరీరానికి మంచి బలాన్ని చేకూరుస్తుంది. ఇందులో క్యాల్షియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఎముకలు బలంగా దృఢంగా తయారవుతాయి. ఇందులో ఫైబర్ మెండుగా ఉంటుంది. తరచూ వీటిని తినడం వల్ల తిన్న ఆహారం బాగా అరుగుదల అవుతుంది. జీర్ణ సమస్యలు తగ్గిస్తుంది. మలబద్దకాన్ని నివారిస్తుంది. మనపగుళ్ళే కాకుండా మినుములతో చేసిన లడ్డు కూడా ఆరోగ్యనికి ఎంతో మంచిది. మినుములతో చేసిన లడ్డును సున్నిలడ్డు అంటారు. ఎదిగే పిల్లలకి దీన్ని తినడం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆడపిల్లకి వీటిని వేపి దంచి పొడి చేసి దానిలో కావాసినంత నెయ్యి వేసి స్వచ్ఛమైన బెల్లంపొడిని కలిపి లడ్డులా చేసి వీటిని రోజుకో లడ్డు వాళ్ళకి ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. ముందుగానే వీటిని ఇవ్వడం వల్ల వీళ్ళు వయసుకు వచ్చినప్పుడు రుతుక్రమసమస్యలు రాకుండా ముందుగానే బాడీ ని ప్రిపేర్ చేసి ప్రొటక్ట్ చేస్తుంది. నెలసరి టైం లో నడుమునొప్పి విపరీతంగా బాధిస్తుంది. అలాంటి టైం లో ఇలా లడ్డు చేసుకొని తినడం వల్ల నడుమునొప్పి, కడుపు నొప్పి, కాళ్ళు చేతులు లాగడం లాంటి వాటికి చెక్ పెట్టవచ్చు. మన అమ్మమ్మల కాలం నాటి నుండి దీన్ని ఫాలో అవుతు వస్తున్నారు. అందుకే అప్పటి వారికి ఇలాంటి ఇబ్బందులు వచ్చేవి కావు. అబ్బాయిలకి అయితే శుక్ర కణాల సంఖ్య పెట్టగడంలో ఇది సహాయపడుతుంది.

# నడుము అందాలతో ట్రెండింగ్ బ్యూటీస్..





మేకప్ వీడియో పోస్ట్ చేసి కొత్త విషయం చెప్పిన సుమ చీరకట్టులో పూర్తి సంప్రదాయ బద్ధంగా శ్రుతిహాసన్ ఫ్రెండ్ ఇంట్లో పార్టీలో చిల్ అవుతున్న నమ్రత శిరోద్కర్ పట్టుచీరలో చందమామలా మెరిసిపోతున్న 'జైలర్' బ్యూటీఫొటోష

ాట్‌తో గ్లామర్ ట్రీట్ ఇచ్చిన హీరోయిన్ రాశీఖన్నా చాలా పద్ధతిగా కనిపించి మనసు దోచేస్తున్న అనంతిక క్లాసికల్ డ్యాన్సర్ లుక్‌లో 'కేజీఎఫ్' ఫేమ్ జోషీ ఆర్చీ పూలతో అందాల్ని దాచేసిన హాట్ బ్యూటీ షామా సికందర్






# దయచేసి నాపేరు వాడుకోకండి

రాజకయీ నేతలకు మోహన్‌బాబు సూచన

నటుడు మోహన్‌బాబు ఎప్పుడూ ముక్కుసూటిగా ఉంటారు. నిర్మొమమాటంగా మాట్లాడుతారు. ఏ రాజకీయ పార్టీ వారైనా తన పేరును స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని సీనియర్ నటుడు ఎం.మోహన్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మధ్యకాలంలో తన పేరును రాజకీయంగా కొందరు వినియోగించుకుంటున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మోహన్ బాబు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. 'మనం అనేక రకాల భావాలున్న వ్యక్తుల ప్రపంచంలో జీవిస్తున్నాము. ఎవరి అభిప్రాయాలు వారివి. అది వారి వారి వ్యక్తిగతం. చేతనైతే నలుగురికి సాయపడటంలోనే మనం దృష్టి పెట్టాలిగానీ సంబంధం లేని వారిని రాజకీయ పార్టీలలోకి వారి వారి అనుబంధం సంస్థల్లోకి తీసుకురావడం బాధాకరం. నాకు అండదండగా ఉన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ శాంతి సౌభ్రాతృత్వాన్ని వ్యాపింపజేయడంలో అందరూ బద్ధులై ఉందామని కోరుకుంటున్నాను. నా విజ్ఞప్తిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాని హెచ్చరిస్తున్నాను' అని మోహన్ బాబు లేఖలో పేర్కొన్నారు.




# సైన్స్ ఫిక్షన్ మూవీగా ప్రభాస్ కల్కి

సలార్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్‌లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా టైటిల్‌పై ఇంట్రెస్టింగ్ న్యూస్ పంచుకున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' అని పెట్టినప్పటినుంచి ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ టైటిల్ 'కల్కి 2898 ఏడీ' అని పెట్టడానికి గల కారణాన్ని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తవుతుంది. గతంతో మొదలై ఫ్యూచర్‌తో ముగుస్తుంది కాబట్టి ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమాలో మొత్తం 6000 ఏండ్ల మధ్య జరిగే కథను చూపించబోతున్నాం.

దానికి తగ్గట్లు ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. అంటూ నాగ్ అశ్విన్ వెల్లడించాడు. ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. అత్యంత భారీ బ్జడెట్‌తో వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొణెళి, దిశా పటానీ, పశుపతి లాంటి సూపర్‌స్టార్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.



# మారిషస్‌లో ఎంజాయ్ చేస్తున్న అనుపమ

టాలీవుడ్‌లో పరిచయం అక్కర్లేని మలయాళ కుట్టి అనుపమ పరమేశ్వరన్.తన కర్లీ హెయిర్‌తో, చబ్బీ లుక్స్‌తో టాలీవుడ్‌లో కోట్లాదిమంది అభిమానులు, ఫాలోవర్లను సంపాదించుకుంది. కార్తికేయ 2తో బ్లాక్ బస్టర్ హిట్టు ఖాతాలో వేసుకున్న ఈ భామ.. ఇటీవలే ఈగల్ సినిమాలో నటించి మెప్పించింది. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ సినిమాలు చేస్తుంది. ఇక త్వరలో టిల్లు స్క్వేర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ భామ.. షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి వెకేషన్‌కు చెక్కేసింది. తాజాగా మారిషస్ టూర్‌కు వెళ్లిన వీడియోను అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మారిషస్ అడవుల్లో రోప్ డైవింగ్, సైకిల్ తొక్కడం, కార్ రేస్, బోటింగ్, బీచ్‌లు సెలయేళ్ల వద్ద ఫుల్ గా ఎంజాయ్ చేస్తూ సాహసాలు చేసింది. అంతేకాకుండా అడవిలో ఉన్న జంతువులను పలకరిస్తూ.. ప్రకృతిని ఆస్వాదించింది. తాజాగా ఈ అడ్వెంచర్‌నంతా వీడియో రూపంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. కాగా ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# యానిమల్ విజయాన్ని ఎంజాయ్ చేయలేకపోయా




'యానిమల్' సినిమా నటిగా కూడా రష్మికను మరో మెట్టుపైన నిలబెట్టింది. ఆ సినిమా సాధించిన విజయం కూడా సామాన్యమైన విజయం కాదు. దాదాపుగా వెయ్యికోట్ల రూపాయలు గ్రాస్ వసూళ్లను రాబట్టింది. బాలీవుడ్‌లో విజయాలను అందుకోవడం చాలామంది హీరోయిన్ల కల. మరి ఆ కల నిజమైనా.. ఆ ఆనందాన్ని ఆస్వాదించలేకపోవడంపై రష్మిక ఇటీవల సోషల్‌మీడియాలో మాట్లాడింది. ' మా 'యానిమల్' పై ప్రశంసలు కురిశాయి. డబ్బులు కూడా అంతకంటే బాగా కురిశాయి. అయితే.. ఆ విజయాన్ని ఎంజాయ్ చేయలేకపోయాను. కనీసం ప్రమోషన్స్‌లో కూడా ఎక్కువగా పాల్గొనలేకపోయాను. దానికి కారణం ఒప్పుకున్న ప్రాజెక్ట్‌లే. నేను చేస్తున్న సినిమాలన్నీ ప్రతిష్టాత్మకమైనవే. ఆ సినిమాల షూటింగులకోసం రాత్రింబవళ్లూ ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి. అందుకే 'యానిమల్' టీమ్‌తోపాటు అభిమానుల్ని కూడా మిస్ అయ్యాను. ఆ లోటును నా రాబోయే సినిమాలు భర్తీ చేస్తాయని భావిస్తున్నాను. అభిమానుల ప్రేమ ఇచ్చేంత సంతోషం నాకు ఏదీ ఇవ్వదు' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా..

# ఎస్ఐపీ ప్రారంభిస్తున్నారా? అయితే ముందు ఇది తెలుసుకోండి..

ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్(ఎస్ఐపీ)ల్లో అధికంగా పెట్టుబడులు పెడుతున్నారు. ఎందుకంటే వీటిల్లో రిస్క్ తక్కువ. రాబడి ఎక్కువ. ఆర్థిక స్థిరత్వం, సంపద సృష్టి కోరుకునే వారి ప్రణాళిక వీటిల్లో పెట్టుబడులు పెట్టడంతోనే ప్రారంభిస్తున్నారు. అయితే వీటిల్లో పెట్టుబడులు ఒక క్రమ పద్ధతిలో పెట్టాలి. క్రమశిక్షణతో పెట్టాలి. వీటిని ప్రారంభించే ముందు అసలు మ్యూచువల్ ఫండ్స్ అంటే ఏమిటి? మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడి అంటేనే రిస్క్. అయితే ఇటీవల కాలంలో వీటిల్లో పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్(ఎస్ఐపీ)ల్లో అధికంగా పెట్టుబడులు పెడుతున్నారు. ఎందుకంటే వీటిల్లో రిస్క్ తక్కువ. రాబడి ఎక్కువ. ఆర్థిక స్థిరత్వం, సంపద సృష్టి కోరుకునే వారి ప్రణాళిక వీటిల్లో పెట్టుబడులు పెట్టడంతోనే ప్రారంభిస్తున్నారు. అయితే వీటిల్లో పెట్టుబడులు ఒక క్రమ పద్ధతిలో పెట్టాలి. క్రమశిక్షణతో పెట్టాలి. వీటిని ప్రారంభించే ముందు అసలు మ్యూచువల్ ఫండ్స్ అంటే ఏమిటి? వాటిల్లో ఎస్ఐపీ ఎలా పనిచేస్తాయి? వాటిల్లో నిబంధనలు ఏమిటి? రాబడి ఎలా ఉంటుంది? వంటి కీలక అంశాలను తెలుసుకోవాలి. అలా తెలుసుకుంటేనే మీ ఆర్థిక లక్ష్యాల వైపు సమర్థంగా ముందుకు వెళ్తారు. సరైన ఫండ్‌ను ఎంచుకోండి: ప్రస్తుతం మార్కెట్లో విభిన్న మ్యూచువల్ ఫండ్‌లు అందుబాటులో ఉన్నాయి, ఒక్కొక్కటి దాని సొంత ప్రత్యేక పెట్టుబడి లక్ష్యం, రిస్క్ ప్రొఫైల్‌తో ఉంటాయి. నిర్ణయం తీసుకునే ముందు పరిశోధన చేయడం, వివిధ నిధులను సరిపోల్చడం ముఖ్యం. ఫండ్ పనితీరు, దాని వ్యయ నిష్పత్తి వంటి అంశాలను పరిగణించండి. మీ పెట్టుబడితో మీరు ఏమి సాధించాలని ఆశిస్తున్నారు? మీరు పదవీ విరమణ, ఇంటిపై డౌన్ పేమెంట్ లేదా మరేదైనా ఆదా చేస్తున్నారా? మీరు మీ లక్ష్యాలను తెలుసుకున్న తర్వాత, మీరు తగిన రిస్క్ ప్రొఫైల్‌తో ఫండ్‌ను ఎంచుకోవచ్చు. అధిక-రిస్క్ ఫండ్‌లు అధిక రాబడికి సంభావ్యతను కలిగి ఉంటాయి కానీ ఎక్కువ నష్టాలకు కూడా అవకాశం కలిగి ఉంటాయి. తక్కువ-రిస్క్ ఫండ్‌లు మరింత స్థిరత్వాన్ని అందిస్తాయి కానీ తక్కువ రాబడిని ఇస్తాయి.




# మూడో వారమూ సానుకూలంగానే.....




భారత స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో వారమూ సానుకూలతలను కొనసాగించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'పడ్డపుడల్లా కొనుగోలు' చేయడం మంచి వ్యూహమవుతుందని సూచిస్తున్నారు. నిఫ్టీ-50 పలుమార్లు తాజా గరిష్ఠాలను చేరొచ్చని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిఫ్టీకి 22,000 వద్ద మద్దతు, 22,500 వద్ద నిరోధాన్ని అంచనా కడుతున్నారు. 22,000 పైన కదిలినంత కాలం బులిష్ ధోరణి కొనసాగొచ్చని చెబుతున్నారు. ఆరో వారమూ ఫార్మా షేర్లు రాణించొచ్చని భావిస్తున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..పెద్దగా వార్తలేమీ లేకపోవడంతో సిమెంటు షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. అల్ట్రాటెక్, ఏసీసీ, అంబుజా సిమెంట్స్‌పై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు.లోహ కంపెనీల షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది. అయితే కొంత ఊగిసలాటలకూ అవకాశం ఉన్నా.. మొత్తం మీద బులిష్‌గానే ఉండొచ్చు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జిందాల్ స్టీల్, టాటా స్టీల్ షేర్లను గమనించొచ్చు.ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు ముందుకే వెళ్లవచ్చు. లాభాల స్వీకరణా జరగొచ్చు. హిందుస్థాన్ యునిలీవర్, టాటా కన్జ్యూమర్, వరుణ్ బేవరేజెస్‌లపై దృష్టి పెట్టవచ్చు. ఐటీసీ షేరు పుంజుకుని మళ్లీ రూ.420కు చేరొచ్చు. ఐటీ కంపెనీల షేర్లు సానుకూల ధోరణితో ట్రేడవవచ్చు. నిఫ్టీ ఐటీ 37,250-38,450 మధ్య చలించొచ్చు. టీసీఎస్ స్వల్పకాలంలో రాణించొచ్చు. అంతర్జాతీయ స్థూల ఆర్థిక కార్యకలాపాలపై మదుపర్లు ఓ కన్నేయాల్సి ఉంటుంది. బ్యాంకు షేర్లు ఒత్తిడిలో కనిపించొచ్చు. బ్యాంక్ నిఫ్టీకి 46,500 వద్ద కీలక మద్దతు లభించొచ్చు. ఆ స్థాయి దిగువను మరింత విక్రయాలు చోటు చేసుకోవచ్చు. 47,000 పైకి వెళితేనే బులిష్ ధోరణికి అవకాశం ఉండొచ్చు.

# 2024-25లో పీవీ విక్రయాల వృద్ధి 5 శాతమే!




వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో దేశీయ ప్రయాణికుల వాహన (పీవీ) విక్రయాల వృద్ధి నెమ్మదించి 5 శాతానికి పరిమితం కావొచ్చని టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహనాల ఎండీ శైలేష్ చంద్ర అంచనా వేశారు.అయితే విద్యుత్ వాహన (ఈవీ) విక్రయాల జోరు మాత్రం కొనసాగుతుందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు ఇంకా పుంజుకోవాల్సి ఉన్నప్పటికీ ఈవీల విక్రయాలు పెరుగుతాయన్నారు. '2022-23లో ప్రయాణికుల వాహన విక్రయాల్లో 25 శాతం వృద్ధి నమోదు చేశాం. 2023-24లో ఇది 8 శాతంగా ఉండొచ్చు.2024-25లో 5 శాతం కంటే తక్కువగా నమోదు కావొచ్చు. ఈవీలకొస్తే విక్రయాలు పుంజుకుంటున్న స్థాయిలో ఛార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధి జరగడం లేదు. ప్రస్తుతానికి ఇది పెద్ద సవాలుగా మారింది. గత త్రైమాసికంలో కమొడిటీ దరలు స్థిరంగా ఉన్నాయి. కానీ రాబోయే రోజుల్లో కొన్నింటి ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈవీ విక్రయాలు 2023-24లో 95-100 శాతం వృద్ధి నమోదు చేయొచ్చు. దేశంలో ఈవీ ఛార్జింగ్ వసతుల విస్తరణ కోసం టాటా మోటార్స్ ఇతర కంపెనీల భాగస్వామ్యంలో పని చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ మేరకు చమురు విక్రయ సంస్థలతో పాటు ఛార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతోనూ చర్చలు జరుపుతున్నాం. మరోవైపు కంపెనీ నుంచి వచ్చే ఈవీల కోసం ప్రత్యేక విక్రయ కేంద్రాలను విస్తరిస్తాం. ప్రస్తుతం గురుగ్రామ్‌లో రెండు విక్రయశాలలు ఉన్నాయి. వచ్చే 18 నెలల్లో ఎక్కువ విక్రయాలు జరిగే అన్ని నగరాలకు విక్రయిస్తామ'ని శైలేష్ చంద్ర వివరించారు. పంచ్ ఈవీతో విద్యుత్ వాహన విభాగంలోకి ప్రవేశించిన టాటా మోటార్స్ ప్రస్తుతం 4 మోడళ్లను విక్రయిస్తోంది. విద్యుత్ ఎస్‌యూవీ కర్వ్, హ్యారియర్ ఈవీలను తీసుకొచ్చే యోచనలో ఉంది. ఈవీ విక్రయాలు 2023-24లో 95-100 శాతం వృద్ధి నమోదు చేయొచ్చు. దేశంలో ఈవీ ఛార్జింగ్ వసతుల విస్తరణ కోసం టాటా మోటార్స్ ఇతర కంపెనీల భాగస్వామ్యంలో పని చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ మేరకు చమురు విక్రయ సంస్థలతో పాటు ఛార్జింగ్ పాయింట్ ఆపరేటర్లతోనూ చర్చలు జరుపుతున్నాం.

# సీఈవోని తొలగించాల్సిందే..

## ఈజీఎంలో ఓటు చేసిన బైజూస్ షేర్‌హోల్డర్లు




**ముంబై :** ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో బైజూ రవీంద్రన్‌ను, ఆయన కుటుంబ సభ్యుల్ని యాజమాన్య స్థానాల నుంచి, డైరెక్టర్ల బోర్డు నుంచి తొలగించాలంటూ ఆ సంస్థ వాటాదారులు ఏకగ్రీవంగా ఓటు చేశారు. పలు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కంపెనీని నడుపుతున్న బైజూ రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యుల్ని సాగనంపేందుకు కొంతమంది ఇన్వెస్టర్లు డిమాండ్ చేసిన అత్యవసర సర్వసభ్య సమావేశం (ఈజీఎం)శుక్రవారం జరిగింది. వారి తొలగింపునకు ప్రతిపాదించిన తీర్మానానికి అనుకూలంగా ఇందుల్లో పాల్గొన్న షేర్‌హోల్డర్లందరూ ఓటు చేశారు. ఈజీఎంకు పిలుపునిచ్చిన ఇన్వెస్టింగ్ సంస్థలకు బైజూస్‌లో 32 శాతంపైగా వాటా ఉంది. ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ సతీమణి చాన్ జుకర్‌బర్గ్‌తో సహా కొన్ని విదేశీ ఫండ్స్ ప్రస్తుత యాజమాన్యాన్ని వ్యతిరేకిస్తున్నాయి. రవీంద్రనాథ్, ఆయన కుటుంబ సభ్యులకు బైజూస్ ప్రమోటింగ్ కంపెనీ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 26.3 శాతం వాటా ఉంది. ఈజీఎంను నిలుపుచేయాలని రెండు రోజుల క్రితం బైజూస్ కర్నాటక హైకోర్టును ఆశ్రయించగా, అందుకు కోర్టు నిరాకరించింది. అయితే ఈజీఎంలో ఆమోదించిన ఎటువంటి తీర్మానాన్ని అయినా తదుపరి విచారణలోగా అమలు చేయరాదని కర్నాటక హైకోర్టు ఆదేశించినందున, మార్చి 13 వరకూ ఈ తీర్మానం అమలుకాదు. యాజమాన్యాన్ని తొలగించాలన్న తీర్మానమే కాకుండా మరో ఆరు తీర్మానాలకు అనుకూలంగా మెజారిటీ షేర్‌హోల్డర్లు ఓటు చేశారు. బోర్డును పునర్వ్యవస్థీకరించడం, యాజమాన్యాన్ని మార్చడం, కంపెనీ చేసిన టేకోవర్లపై థర్డ్ పార్టీతో ఫోరెన్సిక్ దర్యాప్తు జరిపించడం వంటివి ఈ తీర్మానాల్లో ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. థింక్ అండ్ టెర్న్ బోర్డులో వ్యవస్థాపక సీఈవో రవీంద్రనాథ్ బైజూ, ఆయన భార్య, సొదరుడు..ఈ ముగ్గురు కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ఎఆర్‌సిలకు రూ.1.6 లక్షల కోట్ల ఎన్‌పిఎలు

న్యూఢిల్లీ: బ్యాంక్‌లు, విత్త సంస్థలు తమ మొండి బాకీలను వసూలు చేయలేక అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎఆర్‌సి)లకు అప్పగించే ఆస్తులు పెరగొచ్చని రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్, పారిశ్రామికవేత్తల సంఘం అసోచామ్ సంయుక్త నివేదికలో అంచనా వేశాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఎఆర్‌సిల ఎయుఎం 8-9 శాతం పెరిగి రూ. 1.5 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా.




# పేటీఎం యూజర్లకు గుడ్ న్యూస్..

## ఆ ఒక్కటీ చేస్తే ఇక ఏ ఇబ్బందీ ఉండదు...




ప్రస్తుతం పేటీఎం అనే వన్97 అనే కమ్యూనికేషన్స్ అనే మాతృ సంస్థ యాజమాన్యంలో పనిచేస్తోంది. దీని ఆధ్వర్యంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్(పీపీబీఎల్) నడుస్తోంది.

ఇప్పుడు దీని నోడల్ ఖాతాను పీపీబీఎల్ నుంచి యాక్సిస్ బ్యాంక్ కి మార్చింది. దీంతో వినియోగదారులు తప్పనిసరిగా ఓ పనిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పేటీఎం వినియోగిస్తున్న వినియోగదారులు మరోసారి కేవైసీ(నో యువర్ కస్టమర్) చేయాల్సి ఉంటుంది. పేటీఎంపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. లావాదేవీల్లో అవకతవకల వల్ల ఇప్పటి వరకూ డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో ఓ వెలుగు వెలిగిన పేటీఎం త్వరలో కనుమరుగయ్యే అవకాశం ఉంది.

అయితే పేటీఎం సేవలన్నీ యధాతథంగా కొనసాగుతాయని ఇప్పటికే సంస్థ ప్రకటించింది. కాగా ప్రస్తుతం పేటీఎం అనే వన్97 అనే కమ్యూనికేషన్స్ అనే మాతృ సంస్థ యాజమాన్యంలో పనిచేస్తోంది. దీని ఆధ్వర్యంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్(పీపీబీఎల్) నడుస్తోంది. ఇప్పుడు దీని నోడల్ ఖాతాను పీపీబీఎల్ నుంచి యాక్సిస్ బ్యాంక్ కి మార్చింది. దీంతో వినియోగదారులు తప్పనిసరిగా ఓ పనిచేయాల్సి ఉంటుంది.

# టాప్ 8 సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.1 లక్షల కోట్లు లబ్ధి..




గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్-10 సంస్థల్లో ఎనిమిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 1,10,106.83 కోట్లు పెరిగింది.

వాటిలో రిలయన్స్ ఇండిస్టీస్ భారీగా లబ్ధి పొందింది. గతవారం బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 716.16 పాయింట్లు (0.97 శాతం) పెరిగింది. రిలయన్స్ ఇండిస్టీస్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), ఐటీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) భారీగా లబ్ధి పొందాయి. మరోవైపు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్ సంయుక్తంగా రూ. 38,477.49 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కోల్పోయాయి.రిలయన్స్ ఇండిస్టీస్ ఎం-క్యాప్ రూ. 43,976.96 కోట్లు పుంజుకుని రూ. 20,20,470.88 లక్షల కోట్లకు చేరుకున్నది. శుక్రవారం రిలయన్స్ షేర్ తాజా 52 వారాల గరిష్ట స్థాయి రూ. 2,996.15లకు దూసుకెళ్లింది.

ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 27,012.47 కోట్లు పుంజుకుని రూ. 7,44,808.72 కోట్లకు చేరుకుంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రూ. 7,235.62 కోట్లు పెరిగి రూ. 6,74,655.88 లక్షల కోట్లకు పెరిగింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ. 8,548.19 కోట్లు పెరిగి రూ. 5,13,640.37 కోట్ల వద్ద స్థిర పడింది. హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 4,534.71 కోట్లు పెరిగి రూ. 5,62,574.38 కోట్ల వద్ద ముగిసింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 4,149.94 కోట్లు పెరిగి రూ. 6,77,735.03 కోట్లకు చేరుకున్నది.

తద్వారా ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్థానాన్ని ఎస్బీఐ అధిగమించింది. దీంతో దేశంలోనే టాప్-5 కంపెనీల్లో ఒకటిగా ఉందని బీఎస్ఈ తెలిపింది. ఇక భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 3,855.73 కోట్లు పెరిగి, రూ. 6,34,196.63 కోట్ల వద్ద స్థిర పడింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ఎం-క్యాప్ రూ. 793.21 కోట్లు పెరిగాయి.

### రాడిసన్ హెూటల్ డ్రగ్స్ పార్టీలో డైరెక్టర్ క్రిష్..

# నిర్ధారించిన పోలీసులు

హైదరాబాద్: గచ్చిబౌలి రాడిసన్ హెూటల్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో టాలీవుడ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి పేరు తెరపైకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్లో గచ్చిబౌలి పోలీసులు డైరెక్టర్ క్రిష్ పేరును చేర్చారు. డ్రగ్స్ పెడ్లర్ అబ్బాస్ స్టేట్మెంట్లో క్రిష్ పేరు ప్రస్తావించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పార్టీ జరిగే సమయంలో వివేకానందతోపాటు.. రాడిసన్ హెూటల్లో డైరెక్టర్ క్రిష్ ఉన్నట్లు తెలిపారు. గజ్జల వివేక్ నిర్వహించిన పలు పార్టీలకు క్రిష్ హాజరైనట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కేసులో ఆయన పేరును కూడా చేర్చారు. అయితే, ఆయన డ్రగ్స్ తీసుకున్నారా లేదా అనేది తెలియాల్సి ఉంది. క్రిష్ పేరు తెరపైకి రావడంతో మరోసారి టాలీవుడ్ ఇండస్ట్రీలో డ్రగ్స్ కలకలం మొదలైంది. మరికొందరు సినీ సెలబ్రిటీల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్లోని స్టార్ హెూటల్లో డ్రగ్స్తో పార్టీలు చేసుకుంటున్న రాజకీయ, వ్యాపార, సినీ పరిశ్రమతో సంబంధమున్న ముఠాను ఎస్వోటీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సైబరాబాద్ కమిషనరేట్లో సీపీ అవినాశ్ మహంతి వెల్లడించిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని ర్యాడిసన్ బ్లూ హెూటల్లో కొకైన్తో డ్రగ్ పార్టీ జరుగుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు హెూటల్పై దాడిచేశారు. అప్పటికే ముఠా పరారు కావడంతో పార్టీ నిర్వాహకుడైన మంజీర గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ గజ్జల వివేకానంద ఇంటికి వెళ్లి సోదాలు చేశారు. అక్కడాయనకు పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ వాడినట్టు తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో సయ్యద్



అబ్బాస్ అలీ జెఫ్రీ, నిర్భయ్, కేదార్ను పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఆరుగురి కోసం వేట ప్రారంభించారు. నిందితుల నుంచి కొకైన్ వాడిన కవర్లు, డ్రగ్స్కు ఉపయోగించిన పేపర్లు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివేకానంద బీజేపీ నేత కొడుకు కాగా, కేదార్ అలియాస్ కేదార్నాథ్ పలు కంపెనీల్లో డైరెక్టర్గా ఉన్నాడు. సినిమా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నట్టు సమాచారం. వీరిద్దరి సెల్ఫోన్లను విశ్లేషిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వారు ముందుగానే ఫోన్లలోని డాటాను డిలీట్ చేశారని, ప్రత్యేక సాఫ్ట్వేర్ సాయంతో ఆ సమాచారాన్ని రిట్రీవ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేసులో మొత్తం పది మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే పలువుర్ని అరెస్ట్ చేసిన పోలీసులు.. మిగతా వారి కోసం గాలిస్తున్నారు.

## ‘ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ఇందిరా గాంధీని అవమానించినట్టే’



కరీంనగర్: బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్ మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాహిత యాత్రకు అడగడుగునా అడ్డంకులు సృష్టిస్తు అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు సవాల్ విసిరారు. “కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఏం చేశానో ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లోకి వెళుతున్నానని, కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో, మోదీ ఏం చేశారో చెబుతున్నానని వివరించారు. రాముడు అయోధ్యలో పుట్టారనడానికి ఆధారాలేమిటని కించపర్చే వారిని ప్రశ్నిస్తూ జనంలోకి వెళుతున్నానని, కాంగ్రెస్ వాళ్లకు దమ్ముంటే.. ఇదే విధానాలతో, నినాదాలతో ఎన్నికల్లోకి వెళ్లాలని సూచించారు. కరీంనగర్ లో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే.. మంత్రి పదవికి పొన్నం ప్రబాకర్ రాజీనామా చేసి శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమా? అని సవాల్ విససిరారు. 6 గ్యారంటీలను అమలు చేయడం చేతగాక ప్రశాంతంగా ప్రజాహిత యాత్ర చేస్తుంటే కాంగ్రెస్ మూకలను పంపి విధ్వంసం సృష్టించాలనుకుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని పొన్నం ప్రభాకర్ ను హెచ్చరించారు. గతంలో రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ ఆయనను తీవ్రంగా వ్యతిరేకించారని%ొా% ఇప్పుడు కూడా ఇలాంటి విధ్వంసాలకు పాల్పడుతూ అరాచకాలు సృష్టిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తేలా చూస్తున్నారని మండిపడ్డారు. రేవంతన్నా%ొా% పొన్నం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మలిదశ ప్రజాహిత్ర 2వ రోజు బొమ్మెనపల్లిలో ప్రారంభమై రాములపల్లెలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా హుస్నాబాద్ లో కాంగ్రెస్ మూకలు బిజెపి ఫ్లెక్సీలు చింపివేస్తూ, బండి సంజయ్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్న విషయాన్ని మీడియా ప్రతినిధులు ప్రస్తావించారు. ప్రజాహిత యాత్రను ప్రశాంతంగా కొనసాగిస్తున్నాం. మేం చేసిన అభివృద్ధి, మోదీ ప్రభుత్వం చేసిన పనులను, కేంద్రం ఈ నియోజకవర్గానికి వెచ్చించిన నిధులను వివరిస్తూ ప్రజాహిత యాత్రను కొనసాగిస్తున్నామని, కానీ ఇక్కడున్న మంత్రి ప్రతిసారి హల్ చల్ చేయాలని చూస్తున్నారని, ప్రతిదాంట్లో కలుగజేసుకుంటున్నారని మండిపడ్డారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తానని చెప్పారని,. ఇందిరాగాంధీ ఫోటో పెట్టుకుని మేనిఫెస్టో విడుదల చేశారని, ఇవాళ్టికి 80 రోజులైందని, ఎందుకు అమలు చేయడం లేదు? అని ప్రశ్నించారు. 6 గ్యారెంటీలను, మేనిఫెస్టోలోని 423 హామీలను అమలు చేయకుంటే ఇందిరాగాంధీని అవమానించినట్లే ధ్వజమెత్తారు. రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో మునిగిపోయిందని, అయినా హామీలు ఎలా ఇచ్చారని, వాటిని ఎట్లా అమలు చేస్తారో చేసి చూపాలని సవాల్ విసిరారు. పిఎం నరేంద్రమోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలందరికీ ఉచితంగా బియ్యం ఇస్తుంటే రేషన్ షాపుల మద్ద ముఖ్యమంత్రి ఫోటోలు పెట్టుకోవడమేంటని, ప్రధాని ఫోటో ఎందుకు పెట్టుకోవడం లేదని అడిగారు.

## రూ.500లకే గ్యాస్ సిలిండర్.. గైడ్ లైన్స్ ఇవే



హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ మంగళవారం మరో రెండు గ్యారంటీలను ప్రారంభించనుంది. హామీ ఇచ్చిన ప్రకారం ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిన ప్రభుత్వం.. ఈరోజు సాయంత్రం చేవేళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభలో మరో రెండు గ్యారంటీలు.. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ స్కీమ్ తోపాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీమ్ ను ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే.. ఈ రెండు పథకాలకు సంబంధించిన గైడ్ లైన్స్ విషయంలో ప్రజల్లో అనేక అపోహాలు ఉన్నాయి. ఈ క్రమంలో రూ.500 గ్యాస్ పథకానికి సంబంధించి గైడ్లైన్స్ ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు జీవో జారీ చేసింది.

**ఈ పథకానికి గైడ్ లైన్స్ ఇలా ఉన్నాయి..**

- సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం మూడు క్రైటీరియాలను ప్రకటించిన సర్కార్.
- సిలిండర్ సబ్సిడీ కోసం ప్రజాపాలనలో అప్లై చేసిన వారు అర్హులు.
- ఈ పథకానికి అర్హులుగా తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి చేసింది.
- మూడు సంవత్సరాల వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని.. దాని యావరేజ్ ఆధారంగా సంవత్సరానికి సిలిండర్స్ కేటాయించనుంది
- వినియోగదారులు మొదట మొత్తం డబ్బు చెల్లించాలి. ఆ తరువాత వినియోగదారుల ఖాతాలోకి తిరిగి సబ్సిడీ అమౌంట్ జమ చేయనుంది.
- 48 గంటల్లోనే వినియోగదారుల అకౌంట్లోకి సబ్సిడీ జమ చేయనున్నారు.
- గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం నేరుగా ఓఎంసి సంస్థలకు ఇవ్వనుంది. సంస్థల నుంచి డిబిటి ద్వారా వినియోగదారుల ఖాతాల్లో ఆ నగదు జమ కానుంది.
- జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రభుత్వం మానిటరింగ్ చేయనుంది.

## పార్టీ మార్పు వదంతి మీడియా సృష్టి: కమల్ నాథ్



ఛింద్వారా: అధికార భారతీయ జనతా పార్టీ (బిజెపి)లోకి తాను ఫిరాయించగలనని ఊహాగానాలను మీడియా సృష్టించిందని, తాను ఎన్నడూ అటువంటి ప్రకటన చేయలేదని 77 ఏళ్ల కాంగ్రెస్ సీనియర్ నేత కమల్ నాథ్ మంగళవారం స్పష్టం చేశారు. మధ్య ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ రాష్ట్రంలోని స్వస్థలం ఛింద్వారా చేరుకున్న తరువాత విలేకరులతో మాట్లాడుతూ ఆ విషయం చెప్పారు. కమల్ నాథ్ బిజెపిలోకి మారే ఆలోచన ఏదీ లేదని ఆయన సహచరులు, దిగ్విజయ్ సింగ్, జితేంద్ర సింగ్ వంటి పార్టీ సీనియర్ నేతలు పదే పదే హామీ ఇచ్చినప్పటికీ ఆయన బిజెపిలో చేరబోతున్నారంటూ ముమ్మరంగా ఊహాగానాలు సాగాయి. పార్టీ మార్పు గురించి విలేకరులు ప్రశ్నించినప్పుడు, ‘మీరు (మీడియా) అటువంట ఊహాగానాలు లేవదీస్తున్నారు. ఆ విధంగా వేరే ఎవ్వరూ చెప్పడం లేదు.

## ప్రజావాణిపై ప్రభుత్వం ఫుల్ ఫోకస్.. ఫిర్యాదులు పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు



హైదరాబాద్: హైదరాబాద్ లోని డాక్టర్ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే విజ్ఞాపనలను త్వరిత గతిన పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఒక కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.

ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ, ఈ కార్యక్రమంలో వచ్చే విజ్ఞాపనలపై సచివాలయంలో నేడు సాయంత్రం సమీక్షా సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు, కార్మిక, ఉపాధి కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాస రాజు, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య తదితర సీనియర్ అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రజా భవన్ లో ప్రతీ వారం రెండు రోజుల పాటు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజానీకానికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన పిటీషన్లను సంబంధించి పరిష్కారానికి గాను జిల్లా స్థాయిలో తగు నిర్ణయం తీసుకోవడం, అవసరమైతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడానికి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీలో పోలీస్, పంచాయితీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులను సభ్యులుగా నియమించాలని పేర్కొన్నారు. ఈ కమిటీ విధి విధానాలను వెంటనే రూపొందించాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ను ఆదేశించారు.

ఇకనుండి, ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి ప్రత్యేక్షంగా పర్యవేక్షిస్తారని రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నారని మంత్రి తెలియజేశారు. ఆరోగ్య పరమైన సమస్యలతో వచ్చే వారికీ వెంటనే సంబంధిత ఆసుపత్రులకు పంపించి సత్వర చికిత్సలు అందే విధంగా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజావాణికి అందే ఫిర్యాదులలో పోలీస్ శాఖ కు కూడా సంబంధం ఉన్నవి కూడా అధికసంఖ్యలో వస్తున్నందున, ప్రజావాణికి ఒక సీనియర్ పోలీస్ అధికారిని నియమించాలని తెలియజేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి మాట్లాడుతూ, ప్రజావాణిలో అందే ఫిర్యాదులను పరిష్కరించడంలో అత్యంత ప్రాధాన్యతనివ్వాలని అధికారులను కోరారు.

## రోజా.. డైమండ్ రాణి, ఆమెకు సీటు వస్తుందో రాదో డౌటే !

హైదరాబాద్: ఎపి సిఎం జగన్, మంత్రి రోజాలపై సినీ నిర్మాత, కాంగ్రెస్ నేత బండ్ల గణేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోజా డైమండ్ రాణి అని ఆమెకు సీటు వస్తుందో రాదో డౌట్ అని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి యాక్సిడెంటల్ సిఎం కాదనీ, సిఎం జగనే యాక్సిడెంటల్ సిఎం ఆయన ఎద్దేవా చేశారు. గాంధీభవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బండ్ల గణేశ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి పోరాటం చేసిన యోధుడు, ఫైటర్ అన్నారు. భారతదేశంలో రేవంత్ రెడ్డిలాంటి వారు చాలా తక్కువ మంది ఉంటారన్నారు. పోరాడి, కష్టపడి తనను తాను ప్రూవ్ చేసుకుని ముఖ్యమంత్రి అయ్యారన్నారు. నాన్న చనిపోతేనే, నాన్న వారసత్వంతోనే సిఎం అయితే యాక్సిడెంటల్ సిఎం అంటారన్నారు. పులుసు వండిపెట్టింది కాబట్టి రోజా పులుసు పాప అని ఆయన అన్నారు. రేపోమాపో మాజీ అయ్యాక ఇక్కడికి వచ్చి



జబర్దస్త్ ప్రోగ్రామ్ చేసుకోవాలని బండ్ల గణేశ్ వ్యాఖ్యానించారు. సిఎం రేవంత్ రెడ్డిని అనే స్థాయి రోజాకు లేదన్నారు.

**తండ్రి పేరు చెప్పుకొని కెటిఆర్ లీడర్ అయ్యారు...**

తండ్రి పేరు చెప్పుకొని కెటిఆర్ లీడర్ అయ్యారని బండ్ల గణేశ్ మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన డ్యామేజీని చూడటానికి మేడిగడ్డ టూరుకు వెళ్తున్నావా? అని కెటిఆర్ను బండ్ల గణేశ్ ప్రశ్నించారు. కెటిఆర్ రాజకీయ పరంగా డిజాస్టర్ అని, ఆయన చుట్టూ వైఫై లాగ ఈగో ఉంటుందన్నారు. రేవంత్ సిఎం కావడంతో కెటిఆర్ బాధపడుతున్నారని, కెటిఆర్ను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే బిఆర్ఎస్కు 3 సీట్లు కూడా రాకుండాపోయేవని ఆయన ఆరోపించారు. ఇల్లు కొనేందుకే కెటిఆర్ అమెరికా వెళ్లాడని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ లో కవిత, హరీశ్లు మాత్రమే సమర్థులన్నారు.

### ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు..

# సీఎం రేవంత్పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్ : ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు. ప్రజా సంక్షేమంలో లాభ నష్టాలు చూసుకోరు. ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కోసం పెట్టే ఖర్చులో కూడా లాభం తీయాలనుకునేవారు వ్యాపారులు అవుతారు తప్ప పాలకులు కారని మాజీ మంత్రి హరీశ్ రావు సీఎం రేవంత్రెడ్డిపై ఫైర్ అయ్యా రు. సీఎం మిషన్ భగీరథపై మాట్లాడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథలో లాభం వెతికేవాడు ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమన్నారు.



ప్రజలకు నిరంతరం సురక్షితమైన మంచినీరు అందించాలనే గొప్ప ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తెచ్చింది. దేశంలో ఎవరికీ సాధ్యం కాని విధంగా వంద శాతం ఇండ్లకు నల్లాల ద్వారా సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయడం సాధ్యమయింది. ఇది ప్రభుత్వానికి లాభం తెచ్చే పని కాదు కాబట్టి, ఈ మిషన్ భగీరథ దండుగ అని రేవంత్ రెడ్డి మాట్లాడడం అత్యంత శోచనీయమన్నారు. మిషన్ భగీరథ కోసం మా ప్రభుత్వం రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తే, దాన్ని రూ.50 వేల కోట్లకు పెంచి చెబుతున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

**ఆ పథకం ఎందుకు తేవాల్సి వచ్చింది?**

మిషన్ భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని, దానికి తెచ్చిన అప్పుకు వడ్డీ ఎలా కడుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యమైన, భావ దారిద్ర్యమైన ఆరోపణ ఇంకోటి ఉండదని మండిపడ్డారు. అసలు మిషన్ భగీరథ పథకం ఎందుకు తేవాల్సి వచ్చింది? దాని లక్ష్యం ఏమిటి? అనే విషయాలపై కనీస అవగాహన కూడా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి లేకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాకముందు తెలంగాణ రాష్ట్రంలో మంచినీటి సౌకర్యం కలిగిన జనావాసాల సంఖ్య కేవలం 5,672 అయితే, 2023 పూర్తయ్యే నాటికి 23,930 ఆవాస ప్రాంతాలకు మంచినీళ్లు అందుతున్నాయి.

2014కు ముందు కేవలం 30 శాతం ఇండ్లకు మాత్రమే నల్లాల ద్వారా మంచినీటి సౌకర్యం ఉండేది. అది పుడు వంద శాతానికి చేరుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం వందకు వందశాతం నల్లాల ద్వారా మంచినీరు ఇచ్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడిందని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా వెల్లడిం చిందని గుర్తు చేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలి తప్పా అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవు పలికారు.

**ప్రజలు కలలో కూడా ఊహించి ఉండరు**

కాళేశ్వరం ప్రాజెక్ట్పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 48 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించిందని లెక్కలు, ఆధారాలతో సహా చెప్పినా వీరికి అవగాహన కలుగడం లేదన్నారు. రైతులకు సాగునీరు ఇవ్వడాన్ని, ప్రజలకు మంచినీరు ఇవ్వడాన్ని కూడా లాభనష్టాలతో బేరేజు వేసుకునే ప్రభుత్వం ఒకటి వస్తుందని తెలంగాణ ప్రజలు కలలో కూడా ఊహించి ఉండరన్నారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా వేల కోట్లు ఖర్చు అవుతుంది. దాని వల్ల లాభం లేదంటారా? అని ప్రశ్నించారు.

## లోక్సభ ఎన్నికల బరిలో అక్షయ్ కుమార్..?

### చాందినీచౌక్ నుంచి బరిలో దింపే యోచనలో బీజేపీ



ముంబై: లోక్సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. మరో పది రోజుల్లో కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ కూడా విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో అన్ని పార్టీలు ఎన్నికలకు సమాయాత్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రచారాన్ని కూడా మొదలు పెట్టేశాయి. ఇక దేశరాజధాని ఢిల్లీలో లోక్సభ ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి. అక్కడ అధికార ఆప్, కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు కుదిరిన విషయం తెలిసిందే. ఢిల్లీలో మొత్తం 7 లోక్సభ స్థానాలు ఉండగా ఆప్ నాలుగింట్లో, కాంగ్రెస్ మూడింట్లో బరిలోకి దిగబోతోంది. గత ఎన్నికల్లో ఢిల్లీలోని 7 లోక్సభ స్థానాలను బీజేపీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, ఈ సారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఆప్, కాంగ్రెస్ పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయి. కానీ, బీజేపీ సైతం ఈ ఎన్నికల్లో కూడా ఢిల్లీని క్లీన్స్వీప్ చేయాలని చూస్తోంది. ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్కి గట్టి పోటీ ఇచ్చేందుకు ఏడు స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగానే ఓ లోక్సభ స్థానం నుంచి స్టార్ నటుడిని బరిలోకి దించాలని యోచిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com